జన చైతన్యం
'పేట...'దేశం' కంచుకోట
ఐదు ఎన్నికలకు అయిన ఖర్చు రూ.23.2 లక్షలే...
1955లో స్వతంత్రులదే హవా! · 7లో

అన్నదాత ఆశలపై నీళ్లు

వైసీపీ తాజా మేనిఫెస్టోలో రైతులకు మొక్కుబడి సాయం

- ఏడాదికి కేవలం రూ.2,500 పెంచుతున్నట్టు ప్రకటన
- అసంతృప్తి వ్యక్తం చేస్తున్న రైతులు
- ఇప్పటికే టీడీపీ సూపర్ సిక్స్ కింద ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని వెల్లడి





చోడవరం, ఏప్రిల్ 27:

వైసీపీ తాజాగా ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టో అన్నదాతల ఆశలపై నీళ్లు చల్లినట్టయింది. కొత్త మేనిఫెస్టో తమకు మేలు జరిగేలా భరోసా కల్పించలేక పోయిందని రైతులు పెదవివిరుస్తున్నారు. రైతు భరోసా సాయం కేవలం కంటితుడుపుగా ఏడాదికి రూ.2,500 మాత్రమే పెంచిన తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే టీడీపీ సూపర్‌సిక్స్‌లో అన్నదాతకు ఏడాదికి రూ.20 వేలు ప్రకటించింది. దాని కంటే ఎక్కువ ప్రకటిస్తుందనుకుంటే వైసీపీ మొక్కుబడిగా రూ.2,500 పెంచిందని రైతులు అంటున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం ఇస్తున్న రైతు భరోసా రూ.13,500లలో కేంద్ర ప్రభుత్వం తన వాటాగా రూ.6 వేలు చెల్లిస్తున్నది. అంటే వైసీపీ ప్రభుత్వం రైతులకు ఇస్తున్నది కేవలం రూ.7,500 మాత్రమే. ఇప్పుడు ఆ పార్టీ ప్రకటించిన మేనిఫెస్టో ప్రకారం వైసీపీ అదనంగా ఇస్తామంటున్నది కేవలం రూ.2500 మాత్రమే. టీడీపీ సూపర్‌సిక్స్ పథకం కింద ప్రకటించిన సాయం రూ.20 వేలతో పోలిస్తే వైసీపీ ప్రకటించిన రూ.16 వేలు సాయం తమకు ఏ మాత్రం సరిపోదని రైతులు అంటున్నారు.

అన్నదాతకు ఆసరా ఇదేనా?

వాస్తవానికి గత ఐదేళ్లలో అన్నదాత అన్ని విధాలుగా కుదేలయ్యాడు. ఒక పక్క ప్రకృతి విపత్తులకు తోడు, పెరిగిన వ్యవసాయ పెట్టుబడులతో రైతులు అప్పులు, కష్టాలతో సహజీవనం చేస్తున్నారు. జిల్లాలో ప్రధానమైన వరి, చెరకు సాగు చేసే రైతుల పరిస్థితి దయనీయంగా మారిపోయింది. వరి పండించిన రైతులకు వారు అమ్మిన ధాన్యానికి సకాలంలో డబ్బులు రాని పరిస్థితి. ఇక జిల్లాలోని మూడు షుగర్ ఫ్యాక్టరీలు మూతపడిపోవడం, గోవాడ షుగర్ ఫ్యాక్టరీ పరిస్థితి కూడా నేడో రేపో అన్న చందంగా ఉండడంతో చెరకు రైతుల పరిస్థితి కూడా అయోమయంగా ఉంది. బెల్లానికి కూడా ధర రాకపోవడంతో చెరకు రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మరలిపోయారు. ఇక అపరాలు, ఇతర వాణిజ్య పంటలు పండించే రైతులకు కూడా పెట్టుబడికి తగిన మద్దతు ధరలు దక్కక ఏం చేయాలో పాలుపోని పరిస్థితిలో ఉన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో అన్నదాతలకు ఆసరాగా ఉండవలసిన సమయంలో టీడీపీ ప్రకటించిన అన్నదాత సాయం ఏడాదికి రూ.20 వేలు ఆశలు కల్పిస్తుంటే, వైసీపీ ప్రకటించిన రూ.2,500 పెంపు వారిలో నిరాశను కలిగిస్తోంది.

ఇదేమి భరోసా



వైసీపీ ప్రకటించిన రైతు భరోసా ఏమాత్రం ఆశాజనకంగా లేదు. పెరిగిన పెట్టుబడులతో ప్రభుత్వం రైతు భరోసా కింద ఇప్పుడు ఇస్తున్న సాయం రూ.13,500 ఏ మూలకీ చాలడం లేదు. అది కూడా సకాలంలో అందకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఈ పరిస్థితుల్లో కనీసం రూ.20వేలు ప్రకటించి ఉంటే బాగుండేది. కానీ కేవలం రూ.2500 పెంచి రూ.16 వేలతో సరిపెట్టడం సమంజసంగా లేదు.

- బత్తుల నానాజీ, రైతు, బంగారుమెట్ట, బుచ్చెయ్యపేట మండలం

టీడీపీతో పోలిస్తే రూ.4 వేలు తక్కువ



టీడీపీ ప్రకటించిన సాయం రూ.20 వేలతో పోలిస్తే వైసీపీ ఇస్తామంటున్నది చాలా తక్కువ. వైసీపీ తన మేనిఫెస్టోలో పెంచిన సాయం కేవలం రూ.2500 మాత్రమే. విపరీతంగా పెరిగిన పెట్టుబడుల నేపథ్యంలో ఈ సాయం చాలా తక్కువ. టీడీపీ సాయంతో పోలిస్తే వైసీపీ రూ.4 వేలు తగ్గించి ఇస్తామంటున్నది.

- కురచా నారాయణమూర్తి, రైతు, ఎల్‌బీ పట్నం, చీడికాడ మండలం

ఇదేనా రైతును ఆదుకోవడమంటే..



వైసీపీ అన్నదాతలకు ఏదో పెద్ద మేలు చేస్తుందని ఊహించాం. ప్రస్తుతం వ్యవసాయం భారంగా మారిపోయింది. పెట్టుబడులు కూడా రాక ఇబ్బందులు పడుతున్నాం. వైసీపీ కొత్త మేనిఫెస్టోలో గొప్పగా ప్రకటిస్తుందని అనుకుంటే మొక్కుబడిగా రూ.2500 పెంచి చేతులు దులిపేసుకుంది. రైతును ఆదుకోవడమంటే ఇలాగేనా?. ఇది ఏ మాత్రం సంతృప్తికరంగా లేదు.

- సాసుబిల్లి రమణ, రైతు, చినపాచిల, రావికమతం మండలం

మాకు నిరాశ కలిగించింది



వైసీపీ ప్రకటించిన రైతు భరోసా పెంపు రూ.2500లు మాకు ఏమాత్రం ఆనందాన్ని ఇవ్వలేదు. ఈ సాయం మాకు నిరాశను కలిగించింది. కనీసం అన్నదాతకు రూ.20 వేలు సాయం ఇచ్చి ఉంటే బాగుండేది. ఆ భరోసా టీడీపీ ప్రకటించిన సాయంలో కనిపిస్తున్నది. .

- ఉండూరు దేముడు, రైతు, పొంగలిపాక, మాడుగుల మండలం

అసంతృప్తి కనిపించేన్

వైసీపీ మేనిఫెస్టోలో పింఛన్ రూ.500 పెంపుపై లబ్ధిదారుల పెదవివిరుపు



- అది కూడా ఆఖరి నాలుగైదు ఏళ్లలో ఇస్తామనడంపై నిరాశ
- ఇప్పటికే టీడీపీ నెలకు రూ.4 వేలు ఇస్తామని ప్రకటన
- వైసీపీ కూడా అదే స్థాయిలో ఇస్తుందేమోనని పింఛన్‌దారుల ఎదురుచూపులు
- తాజా ప్రకటనపై అసంతృప్తి
- ఎన్నికల్లో ఇది తమకు మైనస్ అవుతుందని వైసీపీ వర్గాల్లో ఆందోళన

చోడవరం, ఏప్రిల్ 27:

వైసీపీ తాజాగా ప్రకటించిన మేనిఫెస్టోలో పింఛన్‌దారులకు భంగపాటు తప్పలేదు. ఇప్పటికే టీడీపీ తన మేనిఫెస్టోలో పింఛన్‌దారులకు నెలకు రూ.4 వేలు చొప్పున ఇస్తామని ప్రకటించింది. అది కూడా అధికారంలోకి వచ్చిన వెంటనే మూడు నెలల బకాయితో కలిపి ఇస్తామని చెప్పింది. అయితే వైసీపీ 2028 సంవత్సరం జనవరిలో రూ.250, అలాగే 2029 జనవరిలో మరో రూ.250 చొప్పున పెంచుతామని ప్రకటించడంపై పింఛన్ లబ్ధిదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 2019 ఎన్నికల నాటికే నెలకు రూ.2 వేలు పింఛన్‌ను అందివ్వగా, వైసీపీ అధికారంలోకి వచ్చాక వెయ్యి రూపాయలు పెంచి రూ.3 వేలు ఇవ్వడానికి ఐదేళ్ల సమయం పట్టింది. కాగా టీడీపీ అధినేత చంద్రబాబు తాము అధికారంలోకి వచ్చిన వెంటనే నెలకు రూ.4 వేల చొప్పున ఇవ్వడంతో పాటు మూడు నెలల బకాయి సొమ్ము కూడా ఇస్తామని మేనిఫెస్టోలో ప్రకటించారు. అయితే వైసీపీ తాజా మేనిఫెస్టోలో రూ.500 పెంచుతామని చెప్పి అది కూడా చివరి నాలుగైదు సంవత్సరాల్లో ఇస్తామని ప్రకటించడంపై పింఛన్‌దారులు పెదవివిరుస్తున్నారు. టీడీపీ నెలకు రూ.4 వేలు చొప్పున పింఛన్ ఇస్తామని చేసిన ప్రకటన ప్రజల్లోకి బలంగా వెళ్లిపోయింది. వైసీపీ మేనిఫెస్టో పింఛన్‌దారులకు నిరాశ కలిగించింది. ఇది కచ్చితంగా తమకు మైనస్ అవుతుందని వైసీపీ వర్గాలే ఆందోళన చెందుతున్నాయి.

రూ.500 కోసం ఐదేళ్లు ఆగాలా?

వైసీపీ ప్రకటించిన పింఛను రూ.500 పెంపు అమలయ్యేది 2028 సంవత్సరం జనవరిలో రూ.250, అలాగే 2029 జనవరిలో మరో రూ.250 మాత్రమే. ఇచ్చే ఆ ఐదు వందల రూపాయల సాయం కూడా ఐదేళ్లకు గానీ చేతికి అందే పరిస్థితి లేదు. ఇది పింఛన్‌దారులకు తీవ్ర నిరాశ కలిగించింది.

నిరాశకు గురయ్యాం



పింఛను నెలకు రూ.4 వేలు ఇస్తామని వైసీపీ ప్రకటిస్తుందని ఆశించాం. రూ.500 పెంచుతామని చెబుతున్నా, నాలుగేళ్లు ఆగాలని అంటున్నారు. ఆ ఇచ్చే రూ.500లైనా వెంటనే ఇస్తామంటే బాగుండేది.

- మైచర్ల చిలుకమ్మ, కింతలి, మాడుగుల మండలం

రూ.4 వేలు ఇస్తే బాగుండేది



టీడీపీ తన మేనిఫెస్టోలో నెలకు రూ.4 వేలు ఇస్తామని ప్రకటించింది. వైసీపీ కూడా అలాగే ప్రకటిస్తుందని అనుకున్నాం. కానీ నిరాశే మిగిలింది. వైసీపీ రూ.500 పెంచుతామని చెబుతున్నా అది ఇప్పట్లో అందే పరిస్థితి లేదు.

- గంజి మహలక్ష్మినాయుడు, రావికమతం

ఎన్నికల బరిలో నిలిచేదెవరో?

- రేపటితో ముగియనున్న నామినేషన్ల ఉపసంహరణ గడువు

అనకాపల్లి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల బరిలో నిలిచేదెవరో? అనే దానిపై సోమవారం స్పష్టత రానున్నది. ఈ నెల 29వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించింది. సోమవారం ఉదయం 11 గంటల నుంచి 3 గంటల వరకు నామినేషన్లు వేసిన అభ్యర్థుల్లో ఎవరైనా స్వయంగా రిటర్నింగ్ అధికారి వద్దకు వెళ్లి నామినేషన్‌ను ఉపసంహరించుకోవచ్చునని అధికారులు చెబుతున్నారు. జిల్లాలో అనకాపల్లి పార్లమెంట్ స్థానానికి మొత్తం 25 మంది అభ్యర్థులు నామినేషన్‌లు దాఖలు చేయగా, ముగ్గురి నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. అలాగే జిల్లాలో ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఆయా నియోజకవర్గాల కేంద్రాల్లో రిటర్నింగ్ అధికారులకు 90 నామినేషన్‌లు అందగా, వాటిని పరిశీలించిన అధికారులు 15 నామినేషన్లను తిరస్కరించారు. 75 నామినేషన్లను ఆమోదించారు. కాగా సోమవారం సాయంత్రానికి జిల్లాలో పార్లమెంట్, అసెంబ్లీ స్థానాలకు నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థులు ఎంతమంది ఉపసంహరించుకున్నారనేది తేలనుంది.

బాబోయ్ ఎండలు

- కశింకోట, రావికమతం, మాకవరపాలెంలో 43.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు

అనకాపల్లి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. శనివారం జిల్లాలోని 11 మండలాల్లో 41 డిగ్రీలు దాటి గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 4 మండలాల్లో వడగాడ్పులు వీచాయి. కశింకోట, రావికమతం, మాకవరపాలెంలో 43.2, నర్సీపట్నంలో 42.4, రోలుగుంట, గొలుగొండలో 42.3, చీడికాడ, చోడవరంలో 41.9, దేవరాపల్లిలో 41.4, మాడుగులలో 41.3, బుచ్చెయ్యపేటలో 41.2, అనకాపల్లిలో 40.9, కోటవురట్లలో 40.4, నబ్బవరంలో 40.3, నాతవరం 40.2, మునగపాక, పరవాడలో 38.4, అచ్యుతాపురంలో 37.5, ఎస్.రాయవరంలో 37.3, ఎలమంచిలిలో 37, పాయకరావుపేటలో 36.9, నక్కపల్లిలో 36.1, రాంబిల్లిలో 35 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాగల 24 గంటల్లో జిల్లాలో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే సూచనలు ఉన్నాయని వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు.

ఒక్క హామీ కూడా నెరవేర్చని వైసీపీ ప్రభుత్వం

చక్కెర కర్మాగారాలను మూసేసి కార్మికులను రోడ్డున పడేసింది

- బహిరంగ సభలో పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ధ్వజం

పాయకరావుపేట, ఏప్రిల్ 27: గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం నియోజకవర్గంలో ఒక్క హామీ నెరవేర్చలేదని, చక్కెర కర్మాగారాలను మూసేసి కార్మికులను రోడ్డున పడేశారని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ధ్వజమెత్తారు. శనివారం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో భాగంగా పాయకరావుపేటలోని సూర్యమహల్ సెంటర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో ఆమె మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో 'పేట'లో ఎమ్మెల్యే ఉన్నా లేనట్టే ఉందని, ఇక్కడ ఉన్న ఆయనను కాదని వేరే నియోజకవర్గం నుంచి అభ్యర్థిని తెచ్చారన్నారు. అక్కడ పనికిరాని చెత్త ఇక్కడ పడేశారని ఆరోపించారు. వీళ్లతో ఏమైనా ఉపయోగం ఉందా? అని ఆమె ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2.30 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయడంతోపాటు రైతులకు రెండు లక్షల రుణ మాఫీ, పెన్షన్ రూ.4 వేలకు పెంపు, ప్రతి పేద కుటుంబానికి ఏడాదికి లక్ష రూపాయల సాయం, పేదలకు రూ.5 లక్షలతో పక్కా ఇళ్లు నిర్మిస్తామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి వేగి వెంకటేశ్‌ను, పాయకరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థి బోని తాతారావును గెలిపించాలని ఆమె కోరారు. అంతకుముందు కాకినాడ జిల్లా నుంచి పాయకరావుపేట వచ్చిన పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డు శ్రీనివాసరావుతో పాటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగతా శ్రీనివాసరావు, నర్సీపట్నం అభ్యర్థి శ్రీరామ్మూర్తి, పెందుర్తి అభ్యర్థి భగత్ తదితరులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, సీపీఎం, సీపీఐ నాయకులు ఎం.అప్పలరాజు, వెలుగు అర్జునరావు తదితరులతో పాటు అధిక సంఖ్యలో కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పాయకరావుపేటలో మాట్లాడుతున్న వైఎస్ షర్మిల

జిల్లాలో 15,96,916 మంది ఓటర్లు

పురుషుల కంటే మహిళా ఓటర్లు 37,057 మంది అధికం

- 3,07,545 మందితో అధిక ఓటర్లున్న నియోజకవర్గం పెందుర్తి
- 1,88,989 మంది ఓటర్లతో చివరి స్థానంలో మాడుగుల నియోజకవర్గం
- తుది ఓటర్ల జాబితా ప్రకారం పెరిగిన ఓటర్లు 15,780

అనకాపల్లి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మొత్తం ఓటర్ల సంఖ్య 15,96,916 మందికి చేరింది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కొత్త ఓట్ల నమోదు కోసం ఈ నెల 16వ తేదీ వరకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించింది. శుక్రవారం తుది జాబితాను జిల్లా ఎన్నికల అధికారులు ఎన్నికల కమిషన్‌కు నివేదించారు. జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో చోడవరంలో 243 పోలింగ్ బూత్‌లు, మాడుగుల 235, అనకాపల్లి 251, పెందుర్తి 299, ఎలమంచిలి 246, పాయకరావుపేట 292, నర్సీపట్నం 262 మొత్తం 1,828 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. దీని ప్రకారం జనవరి 22న ప్రకటించిన జాబితాలో మొత్తం 15,96,916 మంది ఓటర్లు ఉన్నారు. తాజాగా 15,780 పెరిగి ఈ సంఖ్యకు చేరింది. వీరిలో పురుషులు 7,79,913 మంది, మహిళా ఓటర్లు 8,16,970 మంది ఉన్నారు. ఇతరులు 33 మంది ఉన్నారు. జిల్లాలో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు 37,057 మంది అధికంగా ఉన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా చూస్తే పెందుర్తి 3,07,545 మంది ఓటర్లుతో ప్రథమ స్థానంలో ఉండగా, మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గం 1,88,989 మంది ఓటర్లతో చివరి స్థానంలో ఉంది. మే 13న జరగబోయే ఎన్నికల్లో ఈ తుది జాబితాలో పేర్కొన్న ఓటర్లు మాత్రమే ఓటు హక్కు వినియోగించుకొనే అవకాశం ఉంటుంది. ఇక ఎన్నికలు జరిగే వరకు ఓటర్ల జాబితాలో ఎటువంటి మార్పులు, చేర్పులకు అవకాశం ఉండదు.

తుది ఓటర్ల జాబితా ప్రకారం
అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా వివరాలు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	మొత్తం
అనకాపల్లి	1,03,088	1,10,621	2,13,714
చోడవరం	1,05,614	1,11,863	2,17,484
మాడుగుల	92,102	96,886	1,88,989
పెందుర్తి	1,52,592	1,54,948	3,07,545
ఎలమంచిలి	1,00,407	1,05,978	2,06,394
పాయకరావుపేట	1,23,363	2,27,379	2,50,744
నర్సీపట్నం	1,02,747	1,09,295	2,12,046
మొత్తం	7,79,913	8,16,970	15,96,916

నెత్తురోడిన రహదారి

హైవేపై ఘోర ప్రమాదం

- అదుపుతప్పి కంటైనర్ లారీ కిందకు దూసుకుపోయిన కారు
- ముగ్గురి మృతి...మరో యువకుడికి తీవ్రగాయాలు



శరగడం వెంకటలక్ష్మి (ఫైల్)



దాడి గగన్ (ఫైల్)



సుంకర మధుకర్ (ఫైల్)

నక్కపల్లి, ఏప్రిల్ 27:

జాతీయ రహదారిపై అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం వెదుళ్లపాలెం వద్ద శనివారం మధ్యాహ్నం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందారు. మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. మృతుల్లో ఒక మహిళ, ఒక బాలుడు, మరో యువకుడు ఉన్నారు. దీనికి సంబంధించి నక్కపల్లి సీఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

విశాఖ నగరంలోని బుచ్చిరాజుపాలేనికి చెందిన శరగడం వికాస్ (22), అతని తల్లి వెంకటలక్ష్మి (42) శనివారం కారులో కాకినాడ బయలుదేరారు. వారితో అగనంపూడిలో ఉంటున్న వికాస్ మేనమామ కుమారుడు దాడి గగన్ (15), వికాస్ స్నేహితుడు సుంకర మధుకర్ జత కలిశారు. సాయంత్రానికి పాయకరావుపేట చేరుకుని, అక్కడ గల బంధువుల ఇంట్లో ఉండి ఆదివారం ఉదయం కాకినాడ వెళదామనుకున్నారు. అయితే వీరు ప్రయాణిస్తున్న కారు నక్కపల్లి దాటిన తరువాత కిలోమీటరు ... మిగతా 8వ పేజీలో

ఓటింగ్ శాతం పెరిగేలా చూడాలి

- జిల్లా ఎన్నికల పరిశీలకుడు దల్జీత్‌సింగ్ మంగత్



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకుడు దల్జీత్‌సింగ్ మంగత్

అనకాపల్లి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్ శాతం ఎక్కువ ఉండేలా చూడాలని, దీనిపై ఓటర్లకు చైతన్యం కల్పించాలని జిల్లా ఎన్నికల పరిశీలకుడు దల్జీత్‌సింగ్ మంగత్ సూచించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాజకీయ పార్టీలు, అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారులు, రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు సమన్వయంతో పని చేయాలన్నారు. ఎన్నికల నిర్వహణలో ఎటువంటి ఇబ్బందులున్నా రాజకీయ పార్టీల నాయకులు అధికారుల దృష్టికి తీసుకొస్తే సరి చేస్తారని తెలిపారు. ఎన్నికల ప్రచారంలో శబ్ద కాలుష్యాన్ని నివారించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి ఎన్నికల ఏర్పాట్లను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఎన్నికల నిర్వహణకు చేపట్టిన భద్రతా చర్యలను వివరించారు. ఈ సమావేశంలో ... మిగతా 8వ పేజీలో

సాలాపువానిపాలెంలో దారుణ హత్య · 6లో

సాలాపువానిపాలెంలో దారుణ హత్య

- పొలానికి వెళ్లి వస్తున్న వ్యక్తిని హతమార్చిన ఇద్దరు యువకులు
- వివాహేతర సంబంధమే కారణమని అనుమానం



సాలాపు శ్రీనివాసరావు (ఫైల్ ఫొటో)

సబ్బవరం, ఏప్రిల్ 27: మండలంలోని గొటివాడ శివారు సాలాపువానిపాలెం గ్రామంలో శుక్రవారం రాత్రి ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. పొలంలో మోటారు వేయడానికి వెళ్లిన అతన్ని దారి కాసి ఇద్దరు యువకులు హతమార్చారు. వివాహేతర సంబంధమే హత్యకు కారణమని పోలీసులు భావిస్తున్నారు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. గ్రామానికి చెందిన సాలాపు శ్రీనివాసరావు(30)కు దువ్వాడ దరి మంగళపాలేనికి చెందిన భాగ్యలక్ష్మితో ఏడేళ్ల క్రితం వివాహమైంది. వీరికి యశ్వంత్(6), వరుణ్(3) అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. శ్రీనివాసరావు లా వర్సిటీలో ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలకు డ్యూటీకి వెళ్లి రాత్రి 9 గంటలకు ఇంటి వచ్చాడు. గోంగూర తోటకు నీరు పెట్టేందుకు పొలానికి వెళ్లి మోటారు ఆన్ చేసి ఇంటికి వచ్చాడు. అయితే మోటారు ఆగిపోవడంతో ఆన్ చేసేందుకు రాత్రి 11 గంటలకు మళ్లీ పొలానికి వెళ్లాడు. అయితే మార్గమధ్యంలో అతనిని ఇద్దరు యువకులు పట్టుకొని మంచం కోడుతో తలపై మోది హత్య చేశారు. సమీపంలోని పశువుల కల్లంలో ఉంటున్న ఉగ్గిన నూకాలలమ్మ చూసి ఎవరో కొట్టుకుంటున్నారని కేకలు వేసింది. దీంతో శ్రీనివాసరావును ఆ యువకులు కొంత దూరం ఈడ్చుకుపోయారు. శ్రీనివాసరావు తండ్రి అప్పారావు మోటారు ఉన్న నుయ్యి దగ్గరకు వెళ్లి చూశాడు. అక్కడ లేకపోవడంతో వెతుకుతుండగా రక్తపు మరకలు కనిపిం చాయి. ముందుకు వెళ్లి చూడగా కాలువలో శ్రీనివాసరావు మృతదేహం కనిపించింది. వెంటనే స్థానిక పీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో క్లూస్ బృందం వివరాలు సేకరించింది. మృతదేహాన్ని ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి అప్పారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ పిన్నింటి రమణ తెలిపారు.

మూడేళ్లుగా భార్యాభర్తల మధ్య గొడవలు

మూడేళ్ల క్రితం నుంచి స్థానికంగా ఉంటున్న గల్లి రవికుమార్‌తో శ్రీనివాసరావు భార్య భాగ్యలక్ష్మి సన్నిహితంగా ఉంటోంది. దీంతో శ్రీనివాసరావు, భాగ్యలక్ష్మి దంపతుల మధ్య మూడేళ్లుగా గొడవలు జరుగుతున్నాయి. పలుమార్లు గ్రామ పెద్దలు, పోలీసుల సమక్షంలో వారికి కౌన్సెలింగ్ జరిగింది. అయినా గొడవలు జరుగుతూనే ఉన్నాయి. కాగా శుక్రవారం శ్రీనివాసరావు పుట్టినరోజుతో పాటు పెళ్లి రోజు. అయితే ఉదయం భార్యాభర్తలు ఇద్దరూ గొడవ పడ్డారు. శ్రీనివాసరావు మధ్యాహ్నం డ్యూటీకి వెళ్లి తిరిగి వచ్చి హత్యకు గురయ్యాడు. ఈ కేసులో నిందితులు రవికుమార్, గరికిపాటి హరిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు.

జూపార్కుకు కొత్తగా రెండు జిరాఫీలు



ఆరిలోవ, ఏప్రిల్ 27 : నగరంలోని జూపార్కుకు శనివారం కొత్తగా రెండు జిరాఫీలు వచ్చాయి. కోల్‌కత్తాలోని అలీపూర్ జూలాజికల్ పార్కు నుంచి వీటిని తీసుకువచ్చినట్టు జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారీయా తెలిపారు. వాటితో పాటు ఆరు కొత్త జంతువులను కూడా తీసుకువచ్చారు. ప్రస్తుతం వాటిని 40 రోజుల పాటు క్వారంటైన్‌లో వైద్యుల పర్యవేక్షణలో ఉంచి అనంతరం సందర్శకులకు అందుబాటులో ఉంచనున్నారు. జంతు మార్పిడి పద్ధతిలో వీటిని తీసుకువచ్చారు.

కనకదుర్గమ్మ ఆలయంలో దర్శకుడు 'నక్కిన' పూజలు



ఆలయంలో హోమం నిర్వహిస్తున్న త్రినాథరావు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 27: ప్రముఖ సినీ దర్శకుడు నక్కిన త్రినాథరావు తన జన్మదినం సందర్భంగా శనివారం ఇక్కడి గవరపాలెం సతకంపట్టులోని కనకదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో ఆయన లక్ష్మీ గణపతి హోమం చేయించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకుడు కాంద్రేగుల నాయుడు, కర్రి సన్యాసినాయుడు, పీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధం

- అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్



ఎస్.రాయవరంలో ఉపాధి కూలీలతో కలిసి మాట్లాడుతున్న సీఎం రమేష్

పాయకరావుపేట, ఏప్రిల్ 27: రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు ఈ ఎన్నికల్లో జగన్‌ను ఇంటికి పంపేందుకు సిద్ధంగా ఉన్నారని కూటమి అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ అన్నారు. పాయకరావుపేటలో శనివారం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిని వంగలపూడి అనితతో కలిసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ పాలనలో విద్యావంతులైన యువతకు ఉద్యోగావకాశాలు లేక ఎన్ఆర్ఈజీఎస్ పనులకు వెళుతుండడం బాధిస్తోందన్నారు. ఎస్.రాయవరం మండలంలో జరుగుతున్న ఉపాధి పనుల్లో పీజీ, బీటెక్, నర్సింగ్ చేసినవారు ఉపాధి పనులు చేస్తుండడం ఇందుకు నిదర్శనంగా పేర్కొన్నారు. ఉపాధి కూలీలకు ఇచ్చే రూ.300లలో మెటీరియల్ కాంపొనెంట్, మెజర్‌మెంట్ అని, అక్కడకు వచ్చినవారి కంటే అదనంగా పేర్లు చేర్చి ఈ ప్రభుత్వం కోత విధిస్తోందన్నారు. వైసీపీ ప్రభుత్వానికి పారిశుధ్యం, ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధలేదని ఎద్దేవా చేశారు. సీఎం జగన్ ఎన్ని చెప్పినా ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. తనతో పాటు పది సంవత్సరాలు ఎంపీగా ఉన్న అవినాష్‌రెడ్డి కడప జిల్లాను పూర్తిగా దోచేశాడని ఆరోపించారు. మాట్లాడితే తాను పేదవాడిని అంటున్న జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల అఫిడవిట్ చూస్తే వేల కోట్లు ఉన్నాయన్నారు. జగన్ ప్రభుత్వంపై రైతులు, ఉద్యోగులతో పాటు అన్ని వర్గాల ప్రజలు కోపంగా ఉన్నారని, తరలో జరిగే ఎన్నికల్లో బటన్ నొక్కి జగన్‌ని ఇంటికి పంపడం ఖాయమన్నారు. అదేవిధంగా బీజేపీ పెద్దలు రాజ్‌నాథ్ సింగ్ తదితరులు చెప్పినట్టు ఆయన జైలుకు పోవడం ఖాయమన్నారు. జూన్ 4న రాష్ట్రంలో ఎన్డీయే కూటమి అధికారంలోకి వస్తుందని, అనకాపల్లి ఎంపీగా తాను, జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థులు అత్యధిక మెజార్టీతో గెలడం ఖాయమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్, జనసేన నాయకులు తోట నగేశ్, జనసేన పార్టీ నియోజవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి పాల్గొన్నారు.

మహిళలు అన్నింటా ముందంజ

- విద్య, ఉపాధి రంగాల్లో ప్రముఖ పాత్ర
- లక్ష్య సాధనకు అంకితభావం అవసరం
- లా వర్సిటీ సదస్సులో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకటజ్యోతిర్మయి



హైకోర్టు న్యాయమూర్తి వెంకటజ్యోతిర్మయిని సత్కరిస్తున్న లా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ సూర్యప్రకాశరావు

సబ్బవరం, ఏప్రిల్ 27: మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉన్నారని ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకటజ్యోతిర్మయి అన్నారు. మండలంలోని అసకపల్లి దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో 'సాంకేతికత, వ్యాపారం.. ప్రజా జీవితంలో యువతుల పాత్ర' అంశంపై శనివారం ఏర్పాటైన సదస్సులో ఆమె ప్రసంగించారు. మహిళలు వంటగది నుంచి అంతరిక్షానికి చేరుకునే స్థాయికి ఎదిగారన్నారు. టీచర్ నుంచి సాఫ్ట్‌వేర్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ వరకూ మహిళలు లేని రంగం లేదన్నారు. విద్యార్థులు లక్ష్యసాధనకు ముందడుగు వేస్తే సాధించలేని ఉండదన్నారు. నేషనల్ ఉమెన్ కమిషన్ జాయింట్ సెక్రటరీ ఎ.అశోలి చలాయి మాట్లాడుతూ భారత ప్రభుత్వం మహిళల సామాజిక, ఆర్థిక భద్రత కోసం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. సభాధ్యక్షులు, న్యాయ విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ డి. సూర్యప్రకాశరావు మాట్లాడుతూ విద్యా, ఉపాధి రంగాల్లో మహిళల శాతం ఎక్కువన్నారు. భారత మహిళా కమిషన్, డీఎస్ఎన్ఎల్‌యూ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సులో ఆంధ్రా యూనివర్సిటీ రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఫైనాన్స్ సెక్రటరీ బి.లవన్‌కుమార్, ఫ్యాకల్టీ కో-ఆర్డినేటర్, రిజిస్ట్రార్ నందిని సీపీ, ఉమన్ అండ్ ఛైల్డ్ సెంటర్ కన్వీనర్ ప్రొఫెసర్ విజయలక్ష్మి, శ్రీకాకుళం అంబేద్కర్ యూనివర్సిటీ నుంచి వి.సుజాత, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాన్ని తరలిస్తేనే ఎన్నికల్లో పాల్గొంటాం

- తహసీల్దార్‌కు తేల్చి చెప్పిన మూలస్వయంభూవరం గ్రామస్థులు



గ్రామస్థులతో సమావేశమైన తహసీల్దార్ గణపతిరావు తదితరులు

పరవాడ, ఏప్రిల్ 27: వచ్చే నెలలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌ను బహిష్కరించే విషయంలో తాము వెనక్కి తగ్గేది లేదని మండలంలోని కలపాక పంచాయతీ పరిధి మూలస్వయంభూవరం గ్రామస్థులు తహసీల్దార్ ఎస్.గణపతిరావుకు తేల్చి చెప్పారు. సింహాద్రి ఎన్టీపీసీ కాలుష్య కోరల్లో చిక్కుకున్న తమ గ్రామాన్ని తరలించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ఆరోపిస్తూ, ఇందుకు నిరసనగా ఎన్నికలను బహిష్కరిస్తున్నట్టు ఇటీవల సదరు గ్రామస్థులు ప్రకటించిన సంగతి తెలిసిందే. దీంతో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శనివారం మూలస్వయంభూవరంలో స్వీప్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ కాలుష్య సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని ఎన్నికలకు సహకరించాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలన్నారు. ఈ క్రమంలో గ్రామస్థులు తాము పడుతున్న బాధలను ఆయనకు వివరించారు. ఎన్టీపీసీ కాలుష్యం కారణంగా తరుచూ అనారోగ్యాల బారిన పడుతున్నామని, ఇదే విషయాన్ని ఎన్టీపీసీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామం తరలింపు విషయంలో ఎలాంటి హామీ ఇవ్వలేనని, మరోసారి ఆలోచించుకుని ఎన్నికల్లో పాల్గొవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పరవాడ సీఐ బాల సూర్యారావు, గ్రామానికి చెందిన కొత్తపల్లి బాబూరావు, మరిసా రవికుమార్, బొండా అప్పలరాజు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, వీఆర్వో గొల్లవిల్లి భుజంగరావుతో పాటు అధిక సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

భక్తులందరికీ అప్పన్న నిజరూప దర్శనం

- గత అనుభవాలను అధిగమించేందుకు ప్రణాళికలు
- కలెక్టర్ మల్లికార్జున
- చందనోత్సవం ఏర్పాట్లు పరిశీలన



మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, తదితరులు

సింహాచలం, ఏప్రిల్ 27 : సింహగిరిపై వచ్చే నెల 10న జరగనున్న చందనోత్సవంలో భక్తులందరికీ అప్పన్న నిజరూప దర్శనం కల్పిస్తామని కలెక్టర్ డా.ఎం. మల్లికార్జున తెలిపారు. శనివారం సాయంత్రం ఆయన సీపీ రవిశంకర్, దేవస్థానం ఈఓ శ్రీనివాసమూర్తితో కలిసి చందనోత్సవానికి అధికారులు సిద్ధం చేసిన ప్రణాళికలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల కోడ్ వల్ల ప్రొటోకాల్ దర్శనాలు లేవని స్పష్టం చేశారు. అంతరాలయ దర్శనాన్ని కూడా పూర్తిగా రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. వైదిక కార్యక్రమాల అనంతరం వేకువజామున 4 గంటల నుంచి గంట పాటు ధర్మకర్తల కుటుంబానికి, దేవాలయ దాతలకు మాత్రమే అంతరాలయ దర్శనం కల్పించి నీలాద్రి గమ్మం వద్ద నుంచి భక్తులకు స్వామివారి దర్శనం కల్పిస్తామన్నారు. ట్రాఫిక్ సమస్యలను అధిగమించేందుకు పోలీసు శాఖ సమగ్ర ప్రణాళికలు రూపొందించిందని, 40 సాధారణ బస్సులు, 40 మినీ బస్సులను మాత్రమే ఘాట్ రోడ్డులో రాకపోకలకు అనుమతిస్తామని చెప్పారు. టికెట్లు రిసేల్ జరగకుండా ప్రతి టికెటును రెండుసార్లు పంచింగ్ చేసేందుకు ఏర్పాట్లు చేశామని, బార్‌కోడ్ తప్పనిసరిగా ఉంటుందన్నారు. తాగునీటి సమస్య పరిష్కారానికి 150 పాయింట్లు గుర్తించామని, మజ్జిగ అంద జేసేందుకు వాలంటీర్ల సేవలు వినియోగించాలని నిర్ణయించామని చెప్పారు. బయటకు వెళ్లే మార్గం నుంచి ఎవరినీ ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించేది లేదని స్పష్టం చేశారు. మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల మధ్య దేవాలయ సిబ్బందికి ప్రత్యేక దర్శనాలకు అనుమతిస్తామని, 4 నుంచి 5 వరకు దివ్యాంగులకు దర్శనం కల్పిస్తామని తెలిపారు. రూ.1500 టికెట్లు గతంలో కంటే తక్కువగా ముద్రించాలని నిర్ణయించామని, అవసరమైతే తదుపరి నిర్ణయం మేరకు 7 వేలు కంటే తక్కువకు తగ్గిస్తామన్నారు. చందనోత్సవం టికెట్లను 2 నుంచి విక్ర యించనున్నట్టు ప్రకటించారు.

కొండపాలెం జగనన్న కాలనీలో ఆక్రమణలు!

- సామాజిక అవసరాల కోసం కేటాయించి స్థలాల్లో నిర్మాణాలు
- అధికారులకు ఫిర్యాదు చేయగా నోటీసులకే పరిమితం
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నామని పలువురు వెల్లడి



బీటీ రోడ్డును అనుకుని పునాదుల నిర్మాణం



కాలనీలో స్థలాన్ని ఆక్రమించి షాపు ఏర్పాటు చేసిన దృశ్యం

రోలుగుంట, ఏప్రిల్ 27 : మండలంలోని కొండపాలెం జగనన్న కాలనీలో సామాజిక అవసరాల కోసం కేటాయించిన స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయి. కాలనీలో ఇళ్లు పొంది పలువురు లబ్ధిదారులు ఇందుకు తెగబడుతున్నారు. సదరు స్థలాలను ఆక్రమించుకోవడమే కాక, దర్జాగా పునాదులు తీసి అక్రమ నిర్మాణాలు సైతం చేపడుతున్నారు. ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన విరోధి మల్లేశ్వరరావు, నాగులాపల్లి రమణ రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయగా నోటీసుతో సరిపెట్టారే తప్ప, ఎటువంటి చర్యలు తీసుకోలేదని పలువురు ఆరోపిస్తున్నారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరిస్తున్నారు. ఈ జగనన్న కాలనీలో 52 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి 1.5 సెంట్ల స్థలం చొప్పున మంజూరు చేశారు. అంతా దాదాపు ఇళ్ల నిర్మాణాలను సైతం పూర్తిచేశారు. అయితే ఈ కాలనీలో సామాజిక అవసరాల నిమిత్తం బీటీ రోడ్డు (కొమరవోలు- రోలుగుంట)కు మధ్యలో కొంత స్థలాన్ని కేటాయించి వదిలివేశారు. దీంతో ఇదే అదునుగా కాలనీకి చెందిన గాలి జ్యోత్స్న, గాలి అర్జున, బంటు లక్ష్మి, సత్యవతి, పాము లోవరాజు, బంధం నాగమణి, లాలం లోవ తదితరులు తమకు కేటాయించిన స్థలంలో ఇంటి నిర్మాణం అనంతరం, వాటికి ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకుని దర్జాగా పునాదులు నిర్మించుకున్నారు. కొంత మంది ఆక్రమించుకున్న స్థలం చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ అక్రమ నిర్మాణాలపై ఐదు నెలల క్రితమే పంచాయతీ అధికారులకు విరోధి మల్లేశ్వరరావు ఫిర్యాదు చేస్తే నోటీసులు ఇచ్చి ఊరుకున్నారే తప్ప ఆక్రమణదారులపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. తక్షణమే రెవెన్యూ అధికారులు స్పందించి, ఆక్రమణకు గురైన స్థలాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు.

క్రైం... crime news

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

పరవాడ, ఏప్రిల్ 27: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్టు పరవాడ పోలీసులకు శనివారం సమాచారం అందింది. ఇందుకు సంబంధించి పరవాడ సీఐ బాల సూర్యారావు తెలిపిన వివరాలివి. జల్లెలపాలెం గ్రామ సమీపంలోని ఓ ప్రైవేటు లేఅవుట్‌కు ఆనుకుని ఉన్న ఖాళీ స్థలంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన విషయాన్ని పలువరు గుర్తించి పరవాడ పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి వయస్సు సుమారు 38 సంవత్సరాలు ఉండవచ్చునని అంచనా. మృతదేహంపై దుస్తులు కూడా లేవు. సుమారు రెండు రోజుల క్రితమే మృతి చెంది ఉండవచ్చునని తెలుస్తుంది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. మృతుడు సంబంధీకులు ఎవరైనా ఉంటే పరవాడ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాల్సిందిగా సీఐ సూచించారు.

బావిలో స్నానానికి దిగి మృతి



రవికుమార్ (ఫైల్)

దేవరాపల్లి, ఏప్రిల్ 27 : మండలంలోని ముషిడిపల్లి గ్రామం కొటాన వారి కల్లాల సమీపంలో గల వ్యవసాయ బావిలో పడి విశాఖ జిల్లా వేపగుంటకు చెందిన సింగూరు రవికుమార్(45) అనే వ్యక్తి శనివారం మృతి చెందాడు. ఇందుకు సంబంధించి దేవరాపల్లి ఎస్ఐ నాగేంద్ర తెలిపిన వివరాలివి. వేపగుంటలో ఓ దిన పత్రికలో విలేకరిగా పని చేస్తున్న రవికుమార్ అతని సోదరుడు సుధాకర్‌తో కలిసి బైక్‌పై శనివారం ముషిడిపల్లి విచ్చేశారు. వీరికి పరిచయం ఉన్న విశ్రాంత ఉపాధ్యాయుడు దార్ల సత్యారావు పొలంలోకి ఉదయం 11.30 గంటల ప్రాంతంలో వెళ్లారు. అతనితో కాసేపు మాట్లాడిన అనంతరం అక్కడి పొలంలో గల నూతిలో అన్నదమ్ములు ఇద్దరూ స్నానానికి దిగారు. కొంతసేపు ఈత కొట్టిన తరువాత సుధాకర్ బయటకు వచ్చేశాడు. కానీ రవికుమార్ బావిలో ఉన్న మెట్లపై కూర్చొని ఉన్నాడు. కాసేపటి తరువాత సుధాకర్ బావిలో చూడగా రవికుమార్ కనిపించలేదు. దీంతో ఆందోళన చెంది చుట్టుపక్కల ఉన్న రైతులను పిలిపించి నూతిలో గాలించగా, రవికుమార్ మృతదేహం లభ్యమైంది. ఇదిలావుంటే, రవికుమార్‌కు భార్య అనూరాధ, విహాన్, బన్నీ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇతని కుటుంబం హైదరాబాద్‌లో ఉంటుండగా, ఇతడు తన తండ్రి జగన్నాథంతో కలిసి వేపగుంటలో నివాసం ఉంటున్నాడు. ఈ ఘటనపై మృతుని సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. ఇదిలావుంటే, బావిలో దిగిన సమయంలో అన్నదమ్ములు ఇద్దరూ మద్యం తాగి ఉంటారని ఎస్ఐ అనుమానం వ్యక్తం చేశారు.

యువతిని మోసం చేసిన వ్యక్తి అరెస్టు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 27: యువతిని ప్రేమించి, పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన వ్యక్తిని అరెస్టు చేసినట్టు పట్టణ సీఐ జి.శంకరరావు తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన కథనం ప్రకారం వివరాలివి. సత్యనారాయణపురం గ్రామానికి చెందిన యువతిని తాళ్లపాలేనికి చెందిన నానికుమార్ ఏడాదిగా ప్రేమ పేరుతో వేధించేవాడు. ఈ విషయమై ఆమె తన తల్లిదండ్రులకు చెప్పగా పిలిచి మందలించారు. అయితే సదరు యువతికి ఈ ఏడాది ఫిబ్రవరిలో విశాఖకు చెందిన వ్యక్తితో వివాహమైంది. అయినప్పటికీ నానికుమార్ విశాఖకు వెళ్లి ఈమెపై చెడుగా చెప్పడంతో ఆ యువతి భర్త పెద్దల సమక్షంలో ఆమెతో విడాకులు తీసుకుని కోర్టులో దాఖలు చేశాడు. దీంతో ఆ యువతి సత్యనారాయణపురంలోని తల్లిదండ్రుల వద్ద ఉంటుంది. ఆమె తల్లిదండ్రులు లేని సమయంలో వచ్చి నానికుమార్ పెళ్లి చేసుకుంటానని సదరు యువతని మోసగించాడు. తీరా పెళ్లి ప్రస్తావన తెచ్చేసరికి మాటమార్చడంతో ఆమె శుక్రవారం రాత్రి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు నిందితుడ్ని శనివారం అరెస్టు చేసినట్టు సీఐ తెలిపారు.

పది మద్యం బాటిళ్లు స్వాధీనం

పరవాడ, ఏప్రిల్ 27 : పది మద్యం బాటిళ్లతో ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మండలంలోని తిక్కవానిపాలేనికి చెందిన చేపల కొర్లయ్య శనివారం రాత్రి వాడచీపురుపల్లి ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి పది క్వార్టర్ మద్యం బాటిళ్లు కొనుగోలు చేశాడు. వాటిని తీసుకువెళ్తుండగా పరవాడ ఎస్ఐ మల్లేశ్వరరావు మార్గమధ్యలో తనిఖీ చేసి, అతని వద్ద గల బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

చోరీ కేసులో నిందితుడు అరెస్టు

- బంగారు ఆభరణాలు స్వాధీనం

పరవాడ, ఏప్రిల్ 27 : మండలంలోని వెన్నెలపాలెం బీసీ కాలనీలో ఇటీవల పట్టపగలు జరిగిన చోరీ కేసుకు సంబంధించిన నిందితుడ్ని పోలీసులు పట్టుకున్నారు. అతడి వద్ద నుంచి బంగారం వస్తువులను స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించి పరవాడ సీఐ బాలసూర్యారావు తెలిపిన వివరాలివి. వెన్నెలపాలెం బీసీ కాలనీకి చెందిన చుక్క రమాదేవి ఇంట్లో ఈ నెల 16వ తేదీన ఎవరూ లేని సమయంలో దొంగలు ప్రవేశించి బీరువాలో భద్రపరిచిన ఎనిమిది పావు తులాల బంగారం ఆభరణాలను చోరీ చేసిన సంగతి తెలిసిందే. చోరీ జరిగిన తీరును బట్టి స్థానికులే పాల్పడి ఉండవచ్చనని పోలీసులు అనుమానించారు. ఆ దిశగా దర్యాప్తును ప్రారంభించారు. సదరు ఇంటిపక్కనే నివాసం ఉంటున్న పైలా ఉదయ్‌శ్రీనివాస్ అనే యువకుడు చోరీ జరిగిన రోజు నుంచి కనిపించకుండాపోయాడు. ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ చేసి ఉండడంతో పోలీసులు ఆ దిశగా దర్యాప్తును చేశారు. కొత్త సిమ్ తీసుకుని నిందితుడు ఫోన్ వాడుతున్నట్టు గుర్తించారు. సిగ్నల్స్ ఆధారంగా శనివారం అక్కయ్యపాలెం బస్టాప్ వద్ద అతనిని పట్టుకున్నారు. చోరీకి గురైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకుని, అరెస్టు చేశారు.

కంటైనర్లలో తరలిస్తున్న 191 పశువులు పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న పశువులు

పాయకరావుపేట రూరల్, ఏప్రిల్ 27 : మండలంలోని సీతారాంపురం, నామవరం జంక్షన్‌ల వద్ద శనివారం కంటైనర్లలో అక్రమంగా తరలిస్తున్న 191 పశువులను పట్టుకున్నట్టు ఎస్ఐ జోగారావు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలివి. ముందస్తు సమాచారం మేరకు సీతారాంపురం, నామవరం జంక్షన్‌ల వద్ద శనివారం పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఇంతలో నక్కపల్లి నుంచి తుని వైపు వెళుతున్న మూడు కంటైనర్లలో సుమారు 191 పశువులను అక్రమంగా తరలిస్తున్నట్టు గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకుని డ్రైవర్లపై కేసు నమోదు చేశారు. అనంతరం పశువులను తనిఖీ చేయగా అందులో ఒకటి చనిపోయి కనిపించింది. మిగిలిన వాటిని పెందుర్తిలో ఉన్న గోశాలకు తరలిస్తున్నట్టు చెప్పారు.

ప్రశాంతంగా పాలీసెట్

అనకాపల్లి రూరల్, ఏప్రిల్ 27: జిల్లాలోని అనకాపల్లి, నర్సీపట్నం మండలాల్లో శనివారం నిర్వహించిన పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని పాలీసెట్ సమన్వయ అధికారి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. అనకాపల్లి మండలంలోని 16 కేంద్రాల్లో, నర్సీపట్నంలోని 11 కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహించినట్టు వివరించారు. మొత్తం 9670 మంది దరఖాస్తు చేసుకోగా 9014 మంది విద్యార్థులకు పరీక్షకు హాజరైనట్టు పేర్కొన్నారు. వీరిలో 5575 మంది బాలురు కాగా, 3639 మంది బాలికలు పరీక్ష రాసినట్టు తెలిపారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	120.00
లైవ్ ధర	140.00
విత్ స్కిన్	250.00
స్కిన్ లెస్	260.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	400
విజయనగరం	404
శ్రీకాకుళం	404

పేట... దేశం కంచుకోట

నియోజకవర్గానికి ఇప్పటివరకూ 15సార్లు ఎన్నికలు

- అత్యధికంగా ఏడు సార్లు విజయం సాధించిన టీడీపీ
- మూడు పర్యాయాలు కాంగ్రెస్
- రెండు పర్యాయాలు వైసీపీ
- సీపీఐ ఒకసారి గెలుపు

ఆంగ్లేయులపై తిరుగుబాటు బావుటా ఎగురవేసిన పోరాటయోధుడు జగన్నాథ పాయకరావు పేరు మీద ఏర్పడిన పాయకరావుపేట స్వాతంత్ర్యం వచ్చిన తరువాత జనరల్ నియోజకవర్గంగా ఏర్పడింది. అప్పట్లో మద్రాస్ సంయుక్త రాష్ట్రంలో ఉన్న ఈ నియోజకవర్గానికి పాయకరావుపేట మండలం గుంటపల్లికి చెందిన గెడ్డం సన్యాసిరావు శాసనసభ్యునిగా పనిచేశారు. ఆ తరువాత 1952లో జరిగిన ఎన్నికల్లో ఆర్.సాగిసూర్యనారాయణరాజు ఎమ్మెల్యేగా గెలుపొందారు. అనంతరం 1962లో పాయకరావుపేట ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గంగా మారింది. నియోజకవర్గం ఆవిర్భావం నుంచి ఇప్పటివరకూ 15 పర్యాయాలు ఎన్నికలు జరగ్గా ఏడుసార్లు టీడీపీ, మూడుసార్లు కాంగ్రెస్, రెండుసార్లు వైసీపీ, సీపీఐ, కాంగ్రెస్ (ఐ) ఒక్కొక్కసారి గెలుపొందాయి. ఒకసారి ఇండిపెండెంట్ గెలుపొందారు.


పాయకరావుపేట పట్టణం


ఆర్ఎస్ఎస్.రాజు


మారుతి ఆదియ్య


గెడ్డం సన్యాసిరావు


గంటెల సుమన


కాకర నూకరాజు


చెంగల వెంకట్రావు

ఫ్లాష్ బ్యాక్
పాయకరావుపేట నియోజకవర్గం

పాయకరావుపేట ఎస్సీ నియోజకవర్గంగా ఏర్పడిన నాటి నుంచి ఇప్పటివరకూ పరిశీలిస్తే 1962లో జరిగిన ఎన్నికల్లో సీపీఐ తరఫున పోటీ చేసిన మండే పిచ్చియ్య...కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎం.పోతురాజుపై గెలుపొందారు. 1967లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన గంట్లాన సూర్యనారాయణ ఇండిపెండెంట్ అభ్యర్థి బి.నాగభూషణంపై విజయం సాధించారు. అదేవిధంగా 1972లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున రెండోసారి పోటీ చేసిన గంట్లాన సూర్యనారాయణ...మరోమారు ఇండిపెండెంట్ అభ్యర్థి బి.నాగభూషణంపై గెలుపొందారు. 1978లో ఇందిరా కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసిన మారుతి ఆదియ్య...కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన గారా చిననూకరాజుపై గెలుపొందారు.


గొల్ల బాబూరావు


వంగలపూడి అనిత

1982లో ఆవిర్భవించిన తెలుగుదేశం పార్టీకి నియోజకవర్గంలో అధిక సంఖ్యలో ఉన్న బీసీ వర్గాలు మద్దతుగా నిలిచాయి. దీంతో 1983 నుంచి 2004 వరకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ వరుసగా ఆరుసార్లు విజయాలు సాధించింది. 1983లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన గంటెల సుమన...కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆర్.నీలపర్తిపై విజయం సాధించారు. అలాగే 1985 ఎన్నికల్లో టీడీపీ తరఫున పోటీ చేసిన కాకర నూకరాజు...కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జీవీ హర్షకుమార్‌పై, 1989లో టీడీపీ తరఫున రెండోసారి పోటీ చేసిన కాకర నూకరాజు కాంగ్రెస్ తరఫున బరిలోకి దిగిన గంటెల సుమనపై విజయం సాధించారు. అలాగే 1994లో మూడోసారి టీడీపీ తరఫున పోటీ చేసిన కాకర నూకరాజు మరోమారు కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన గంటెల సుమనపై విజయం సాధించారు. 1999లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన సినీ నిర్మాత చెంగల వెంకట్రావు...కాంగ్రెస్ పార్టీ తరఫున మూడోసారి పోటీ చేసిన గంటెల సుమనపై విజయం సాధించారు. 2004లో జరిగిన ఎన్నికల్లో కూడా టీడీపీ, కాంగ్రెస్ తరఫున వీరిద్దరే పోటీపడగా చెంగల వెంకట్రావును విజయం వరించింది. ఇక నియోజకవర్గాల పునర్విభజనలో కాంగ్రెస్‌కు పట్టున్న కోటవురట్ల మండలాన్ని నాడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ 'పాయకరావుపేట'లో చేర్చింది. దీంతో టీడీపీ జైత్రయాత్రకు బ్రేకు పడింది. 2009 ఎన్నికల్లో టీడీపీ తరఫున మూడోసారి చెంగల వెంకట్రావు బరిలోకి దిగగా, కాంగ్రెస్ పార్టీ తరఫున గొల్ల బాబూరావు, ప్రజారాజ్యం పార్టీ అభ్యర్థిగా జి.ధనరాజ్ పోటీ చేశారు. త్రిముఖ పోటీలో గొల్ల బాబూరావు స్వల్ప మెజారిటీతో గెలుపొందారు. ఆ తరువాత వైసీపీ ఆవిర్భావంతో ఆ పార్టీలో చేరిన గొల్ల బాబూరావు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడంతో 2012లో ఉప ఎన్నిక వచ్చింది. వైసీపీ తరఫున గొల్ల బాబూరావు పోటీ చేసి టీడీపీ అభ్యర్థి చెంగల వెంకట్రావుపై విజయం సాధించారు. ఇక 2014 ఎన్నికల్లో టీడీపీ తరఫున పోటీ చేసిన వంగలపూడి అనిత...వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన చెంగల వెంకట్రావుపై విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో వైసీపీ తరఫున పోటీ చేసిన గొల్ల బాబూరావు టీడీపీ అభ్యర్థి డాక్టర్ బి.బంగారయ్యపై విజయం సాధించారు. ఈ నియోజకవర్గానికి సంబంధించి ఎస్.రాయవరం మండలానికి చెందిన కాకర నూకరాజు 1985, 1989, 1994 ఎన్నికల్లో టీడీపీ తరఫున వరుసగా మూడుసార్లు గెలుపొంది హ్యాట్రిక్ కొట్టారు. ఇప్పటివరకూ ఆయన రికార్డును ఎవరూ బ్రేక్ చేయలేకపోయారు.

మరోసారి టీడీపీ, వైసీపీ మధ్య ప్రధాన పోటీ

వచ్చే నెలలో జరగనున్న ఎన్నికల్లో పాయకరావుపేట నుంచి తెలుగుదేశం పార్టీ అభ్యర్థినిగా వంగలపూడి అనిత, వైసీపీ అభ్యర్థిగా కంబాల జోగులు పోటీలో ఉన్నారు. ఇంకా పార్టీల నుంచి అభ్యర్థులు, ఇండిపెండెంట్లు బరిలో ఉన్నా టీడీపీ, వైసీపీ మధ్య ప్రధాన పోటీ జరగనున్నది. 2014 ఎన్నికల్లో పాయకరావుపేట నుంచి టీడీపీ తరఫున పోటీ చేసి గెలుపొందిన వంగలపూడి అనిత 2019 ఎన్నికల్లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరు నియోజకవర్గం పోటీ చేసి ఓటమి చెందారు. ఇప్పుడు టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా ఆమె పోటీ చేయబోతున్నారు. ఇక వైసీపీ అభ్యర్థి అయిన కంబాల జోగులు 2004 ఎన్నికల్లో శ్రీకాకుళం జిల్లా పాలకొండ నియోజక వర్గంలో టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారు. 2014, 2019 ఎన్నికల్లో వైసీపీ తరఫున రాజాం అసెంబ్లీ స్థానానికి పోటీ చేసి రెండుసార్లు గెలుపొందారు. ఇప్పుడు పాయకరావుపేట నుంచి బరిలోకి దిగారు.

● పాయకరావుపేట

1952లో పాయకరావుపేట నియోజకవర్గం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటివరకూ జరిగిన ఎన్నికల వివరాలు

సంవత్సరం	విజేత	పార్టీ	ఓట్లు	సమీప ప్రత్యర్థి	పార్టీ	ఓట్లు	విజేత మెజారిటీ
1952	ఆర్ఎస్ఎస్ రాజు	ఇండిపెండెంట్	9,757	ఎస్.ఎ.నాయుడు	కాంగ్రెస్	5,737	4,020
	ఎస్సీ నియోజకవర్గంగా	ఏర్పడిన తరువాత నుంచి..					
1962	మండే పిచ్చియ్య	సీపీఐ	13,464	ఎం.పోతురాజు	కాంగ్రెస్	11,379	2,085
1967	జి.సూర్యనారాయణ	కాంగ్రెస్	13,804	బి.నాగభూషణం	ఇండిపెండెంట్	12,165	1,639
1972	జి.సూర్యనారాయణ	కాంగ్రెస్	21,844	బి.నాగభూషణం	ఇండిపెండెంట్	3,588	18,256
1978	మారుతి ఆదియ్య	కాంగ్రెస్(ఐ)	29,490	జీసీ.నూకరాజు	కాంగ్రెస్	14,023	15,467
1983	గంటెల సుమన	టీడీపీ	34,090	ఆర్.నీలపర్తి	కాంగ్రెస్	10,252	22,778
1985	కాకర నూకరాజు	టీడీపీ	42,821	జీవీ హర్షకుమార్	కాంగ్రెస్	13,053	28,769
1989	కాకర నూకరాజు	టీడీపీ	38,764	గంటెల సుమన	కాంగ్రెస్	35,486	3,278
1994	కాకర నూకరాజు	టీడీపీ	39,666	గంటెల సుమన	కాంగ్రెస్	35,657	4,009
1999	చెంగల వెంకట్రావు	టీడీపీ	46,478	గంటెల సుమన	కాంగ్రెస్	38,902	7,576
2004	చెంగల వెంకట్రావు	టీడీపీ	40,794	గంటెల సుమన	ఇండిపెండెంట్	27,105	13,689
2009	గొల్ల బాబూరావు	కాంగ్రెస్	50,698	చెంగల వెంకట్రావు	టీడీపీ	50,042	656
2012	గొల్ల బాబూరావు	వైసీపీ	71.963	చెంగల వెంకట్రావు	టీడీపీ	57,601	14,362
2014	వంగలపూడి అనిత	టీడీపీ	86,355	చెంగల వెంకట్రావు	వైసీపీ	83,527	2,828
2019	గొల్ల బాబూరావు	వైసీపీ	98,745	బి.బంగారయ్య	టీడీపీ	67,556	31,189

మీరూ పంపించండి

ఎన్నికల వేడి మొదలయ్యింది. పార్టీలు, అభ్యర్థులు సమరాంగణానికి సిద్ధమవుతున్నారు. ఎటువంటి వారు అధికారంలోకి రావాలని మీరు కోరుకుంటున్నారు? పాలకులు ఎలా ఉండాలనుకుం టున్నారు?, ఏం చేయాలని కోరుకుంటున్నారు? ...అభిప్రాయం ఏదైనా మీ మనసులో మాట మాతో పంచుకోండి. దాన్ని 'ఆంధ్రజ్యోతి' పాఠకుల ముందుంచుతాం. ఇంకెందుకు ఆలస్యం మీ అభిప్రాయాన్ని, ఫోటోతో సహా ఈ నంబరుకు వాట్సాప్ చేయండి.

వాట్సాప్ నంబర్ ... 9848212243



ప్రమాదంలో ప్రజాస్వామ్యం



సమాజంలో ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో అసమానతలు పెరిగిపోతున్నాయి. మహిళలకు భద్రత లేకుండా పోయింది. నేరాలకు పాల్పడిన వారికి తగిన శిక్ష పడడంలేదు. అన్ని వర్గాలు ప్రమాదంలో ఉన్నాయి. ప్రభుత్వాలు ఓట్ల రాజకీయమే తప్ప సమాజంలో పెనుసవాళ్లను పట్టించుకోవడం లేదు. ఓటర్లు కళ్లు తెరవాలి. ఆధునిక భావాలు కలిగిన వారిని చట్ట సభలకు పంపాలి. ప్రలోభాలకు లొంగకపోతే మంచి ప్రభుత్వాలు ఏర్పడతాయి.

- డాక్టర్ గూడూరు సీతామహాలక్ష్మి, స్పెక్ట్ ఛైర్‌పర్సన్, ఎన్ఏడీ

సంపదను సృష్టించగలగాలి



రాష్ట్రాభివృద్ధికి సంపద సృష్టించగల ప్రభుత్వం కావాలి. అప్పులుచేసి నెట్టుకొస్తే అది మన జీవితాలను ఛిన్నాభిన్నం చేస్తుంది. విజన్ ఉన్న నేతలను ఎన్నుకుంటే మేలు జరుగుతుంది. ఇలాంటి నేతలకు ఓటు వేస్తేనే సమాజానికి మేలు.

- బీహెచ్ అప్పారావు, అనకాపల్లి

వసతులు కల్పించాలి




రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో కనీస మౌలిక వసతులు కల్పించాలి. పారిశ్రామికీకరణతో పాటు వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి. అలాంటి సత్తా ఉన్న నాయకులను ఎన్నుకోవాలి.

- కొర్రా కృష్ణారావు, పెదబయలు

1955లో స్వతంత్రులదే హవా!

ఇండిపెండెంట్లకు పట్టం కట్టిన జిల్లా

గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు రంగంలో ఉన్నప్పటికీ స్వతంత్రులుగా పోటీచేసిన ఎంతోమందిని చట్టసభలకు పంపిన చరిత్ర విశాఖ జిల్లాకు ఉంది. రాష్ట్రంలో 1955లో పూర్తిస్థాయి ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో ఇతర జిల్లాలకు భిన్నంగా విశాఖపట్నం జిల్లాలో అనేక నియోజకవర్గాలలో ఇండిపెండెంట్లు జయకేతనం ఎగరవేశారు. ఈ రికార్డు ఆ తర్వాత ఏ ఎన్నికల్లోనూ నమోదు కాలేదు. అప్పటి అసెంబ్లీలో 196 సీట్లుండగా వాటిలో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీకి 119 సీట్లు వచ్చాయి. కృషీకార్ లోక్‌పార్టీకి 22, సీపీఐకు 15, ప్రజా సోషలిస్టుపార్టీకి 13, ప్రజాపార్టీకి 5 సీట్లు రాగా ఇండిపెండెంట్లు 22 మంది ఎన్నికయ్యారు. వీరిలో ఎనిమిది మంది విశాఖ జిల్లా నుంచే గెలుపొందడం విశేషం. అప్పటి ఎన్నికల సమయంలో ఒక నియోజకవర్గానికి ఇద్దరేసి ఎమ్మెల్యేలు ప్రాతినిథ్యం వహించేవారు. ఒకరే ఎమ్మెల్యే ఉన్న నియోజకవర్గాలూ ఉండేవి. ఆ ఎన్నికల సమయానికి గూడెం, కణితి, కొండకర్ల, గొలుగొండ, రేవిడి, నియోజకవర్గ కేంద్రాలుగా ఏండువి. ఆ తర్వాత కాలంలో వాటిని పక్క నియోజకవర్గాలలో విలీనం చేశారు.



సత్తాచాటిన ఇండిపెండెట్లు

ఆనాటి విశాఖ జిల్లాలో అనేక నియోజకవర్గాలలో ఇండి పెండెంట్లు గెలుపొందారు. గూడెం నియోజకవర్గంలో మత్స్యరాజు మత్స్యరాజు కృషీకార్ లోక్‌పార్టీ నాయకుడు కాద పెన్నయ్యపై గెలుపొందారు. ఇతనికి 3,880 ఓట్లు రాగా పెన్నయ్యకు 2,066 ఓట్లు వచ్చాయి. గొలుగొండ నియోజకవర్గంలో రుత్తల లచ్చాపాత్రుడు 13,932 ఓట్లు తెచ్చుకుని గెలుపొందారు ఇతనిపై పోటీ చేసిన కృషీకార్‌లోక్ పార్టీ అభ్యర్థి పాసపు తమ్మునాయుడుకు 7,826 ఓట్లు వచ్చాయి. నర్సీపట్నం నియోజకవర్గంలో ఇద్దరు ఎమ్మెల్యేలూ ఇండిపెండెంట్లే జాతీయ పార్టీల అభ్యర్థులను ఓడించారు. ఒకరు రాజాసాగి సూర్యనారాయణరాజు. ఇతనికి 23,574 ఓట్లు రాగా మరొకరు ముత్యాల పోతురాజు 21,346 ఓట్లు సంపాదించారు. ఎలమంచిలి నియోజకవర్గం నుంచి చింతలపాటి వెంకట సూర్యనారాయణరాజు 13,621 ఓట్లు తెచ్చుకుని గెలవగా, సీపీఐ అభ్యర్థి కాండ్రేగుల రామజోగి 9,961 ఓట్లు మాత్రమే సాధించగలిగారు. చోడవరం నియోజకవర్గంలో ఇండిపెండెంటు రెడ్డి జగన్నాథం 12,658 ఓట్లు సాధించగా, కృషికార్ లోక్‌పార్టీ అభ్యర్థి బోజంకి గంగయ్యనాయుడు 11,796 ఓట్లకు పరిమితమయ్యారు. కణితి నియోజకవర్గంలో ఇండిపెండెంట్ బీజీఎంఏ నరసింగరావు 10,171 ఓట్లు సంపాదించగా, సీపీఐ అభ్యర్థి పోతిన సన్యాసిరావుకు 6,233 ఓట్లు వచ్చాయి. విశాఖపట్నం నియోజకవర్గంలో ప్రధాన పార్టీల నాయకులు ఎవరూ సరైన ఓట్లు సంపాదించలేకపోయారు. ఇండిపెండెంటు అంకితం వెంకట భానోజీరావు 15,457 ఓట్లు, మరో స్వతంత్ర అభ్యర్థి మద్దిపాటి అభిరామరెడ్డి 6,955 ఓట్లు సాధించారు. కాగా ఇండియన్ నేషనల్ కాంగ్రెస్‌పార్టీ కి రాష్ట్రంలో 119 సీట్లు సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగా విశాఖజిల్లాలో ఆ పార్టీకి ఒక్క సీటు కూడా రాకపోవడం విచిత్రంగా చెప్పుకుంటారు.

● భీమునిపట్నం (రూరల్)

ఐదు ఎన్నికలకు అయిన ఖర్చు

రూ. 23.2 లక్షలే..

- ఇప్పుడు పరిస్థితి మారిపోయింది
- ఎన్నికల్లో డబ్బు ప్రాధాన్యం పెరుగుతోంది
- ఓటర్ల ఆలోచనల్లో కూడా మార్పు వచ్చింది
- అప్పట్లో గ్రామానికి ఏం చేస్తారని అడిగేవారు
- ఇప్పుడు వ్యక్తిగత ప్రయోజనాలకే పెద్దపీట
- నిత్యం ప్రజల్లో ఉండడం వల్లే నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా ఎన్నిక కాగలిగా...
- తొలిసారి ఎమ్మెల్యేగా పనిచేసిన ఐదేళ్లలో స్కూటర్ కూడా లేదు



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

'ఆంధ్రజ్యోతి'తో టీడీపీ సీనియర్ నాయకుడు పప్పల చలపతిరావు

నాటికీ, నేటికీ ఓటర్ల ఆలోచనల్లో బాగా మార్పు వచ్చిందని, గ్రామాభివృద్ధి కంటే వ్యక్తిగత ప్రయోజనానికే అత్యధికులు ప్రాధాన్యం ఇస్తున్నారంటున్నారు సీనియర్ రాజకీయ నాయకుడు పప్పల చలపతిరావు అన్నారు. రాను రాను ఎన్నికల్లో డబ్బు ప్రాధాన్యం పెరుగుతోందన్నారు. ఎలాంటి వ్యాపారాలు, వ్యాపకాలు పెట్టుకోకుండా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండడం వల్లే తాను నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా ఎన్నిక కాగలిగానన్నారు. తెలుగుదేశం ఆవిర్భావం నుంచి...అంటే దాదాపు నాలుగు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉన్న చలపతిరావు తెలుగుదేశం పార్టీ తరఫున నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా ఎన్నికయ్యారు. ఇంకా టీటీడీ ఛైర్మన్‌గా, ఎమ్మెల్సీగా కూడా పనిచేశారు. ఆయన ప్రస్తుతం కూటమి అభ్యర్థుల గెలుపు కోసం విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. జిల్లా రాజకీయాల్లో సౌమ్యునిగా, వివాదరహితునిగా పేరున్న చలపతిరావు ఎలమంచిలిలో 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో మాట్లాడారు. తన రాజకీయ జీవితంలో విశేషాలను వివరించారు. అవి ఆయన మాటల్లోనే..

నాడు పార్టీలో స్వచ్ఛందంగా చేరాను

నాడు ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీలో 1984 స్వచ్ఛందంగా చేరాను. పార్టీలో చేరడానికి ముందు రాంబిల్లి మండలం మురకాడ గ్రామ మునసబుగా, దిమిలి ఎల్ఎస్‌సీఎస్ (లార్జ్ సైజ్డ్ కో-ఆపరేటివ్ సొసైటీ) అధ్యక్షునిగా రెండుసార్లు గెలిచాను. 1984లో ఎన్టీఆర్ గ్రామ మునసబు వ్యవస్థను రద్దు చేయడంతో ఆ ఉద్యోగం కూడా పోయింది. మాది రాజకీయంగా గుర్తింపు ఉన్న కుటుంబం. మా పెదనాన్న పప్పల బాపునాయుడు 1952లో నియోజకవర్గానికి మొట్టమొదటి ఎమ్మెల్యేగా కేఎల్‌పీ తరఫున పోటీ చేసి గెలుపొందారు. 1976లో మా మామయ్య నగిరెడ్డి సత్యనారాయణ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు.

టికెట్ వస్తుందని అనుకోలేదు

1985లో నాదెండ్ల భాస్కరరావు వల్ల ఏర్పడిన సంక్షోభంలో ఎలమంచిలి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి చెందిన పెద్ద నాయకులంతా టీడీపీని వీడారు. అప్పటికి నేను నాయకుడిని కాదు. ఆ సమయంలో ప్రజలంతా ఎన్టీఆర్ వైపు ఉన్నారు. గ్రామాల్లో సభలు, సమావేశాలు నిర్వహించే వాళ్లం. ఎలమంచిలి పంచాయతీ కార్యాలయం సమీపంలో ఎన్టీఆర్‌కు మద్దతుగా రిలే నిరాహార దీక్షలు చేపట్టాం. మాతోపాటే స్వర్గీయ ఆడారి తులసీరావు పనిచేశారు. సంక్షోభం ముగిసి మళ్లీ ఎన్టీఆర్ ముఖ్యమంత్రి అయిన తరువాత అసెంబ్లీని రద్దు చేసి ఎన్నికలకు సిద్ధమయ్యారు. ఆడారి తులసీరావు ఎమ్మెల్యే టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. అంతకుముందు ఒకసారి అనుకోకుండా హైదరాబాద్ వెళ్లాను. అక్కడ ఎన్టీఆర్ ఎమ్మెల్యే అభ్యర్థుల కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారని తెలిసి వెళ్లాను. ఆశావహులతో చాంతాడంత క్యూ ఉంది. ఆ క్యూలో ఫైలు పట్టుకుని నేనూ నిల్చున్నాను. అర్థగంట తరువాత నాకు అవకాశం వచ్చింది. ఇంటర్వ్యూ గదిలోకి వెళ్లాను. సోఫాలో ఎన్టీఆర్ కూర్చున్నారు. ఇద్దరు పీఏలు ఆయన వెనుక నిల్చుని ఉన్నారు. ఎన్టీఆర్ నన్ను పట్టించుకోలేదు. కొద్ది నిమిషాలు తర్వాత నేను ఎదురుగా ఉన్న మరొక సోఫాలో కూర్చున్నాను. దీంతో ఎన్టీఆర్ ఏం? అన్నారు. లేచి నిలబడిన నేను ఇంటర్వ్యూలు జరుగుతున్నాయని తెలుసుకుని వచ్చానన్నాను. నేను టికెట్ కోసం రాలేదు...మీకో చిన్న సూచన చేద్దామని వచ్చాను అని అనగానే ఎన్టీఆర్ కోపంగా నా వైపు చూశారు. లోలోపల భయం వేసింది అయినప్పటికీ ధైర్యం చేసుకుని టికెట్ల కేటాయింపులో నియోజకవర్గాల్లో బలమైన సామాజిక వర్గాల అభ్యర్థులను ఎంపిక చేస్తే అన్ని స్థానాల్లోనూ మంచి మెజారిటీ వస్తుందని సూచించా. సరే చూద్దాం...అన్నారు. నేను బయటకు వచ్చేశాను. పీఏ నన్ను మళ్లీ లోపలకు పిలిచారు. 'నీ పేరేంటి' అని ఎన్టీఆర్ అడిగి చిరునామా రాసుకున్నారు. మీ నియోజకవర్గంలో ఏ సామాజికవర్గం ఎక్కువ అని అడిగారు. వివరాలు చెప్పాను. నా సామాజిక వర్గం అడిగారు చెప్పాను. మా నియోజకవర్గంలో ఎంక్వయిరీ చేసుకుని ఎవరికి టికెట్ కేటాయించినా మంచి ఫలితాలు ఉంటాయన్నాను. తరువాత ఎన్నికలు దగ్గరకొచ్చాయి. టికెట్ కేటాయింపులు జోరందుకున్నాయి. ఆడారి తులసీరావుకు మద్దతుగా మేం కూడా హైదరాబాద్‌కు వెళ్లాం. అయితే అనూహ్యంగా ఎలమంచిలి టికెట్ నాకు ఇచ్చారు.

అద్దె కారులో ప్రచారం

సీటు రావడంతో ఒక అంబాసిడర్ కారును అద్దెకు తీసుకుని నెల రోజులు పాటు ఎన్నికల ప్రచారం చేశా. ఓటర్లకు డబ్బు, మద్యం, వంటివి ఏమీ పంపిణీ చేయలేదు. మొత్తం ఆ ఎన్నిక ఖర్చు 1.9 లక్షలు. తొలిసారి ఎమ్మెల్యేగా పనిచేసిన ఐదేళ్లు నాకు స్కూటర్ కూడా లేదు. ఎవరైనా పనుల కోసం వచ్చేవారు నన్ను స్కూటర్‌పై తీసుకువెళ్లేవారు. 1989లో కూడా పార్టీ టికెట్ నాకే వచ్చింది అప్పుడు స్నేహితులు, శ్రేయోభిలాషులు, బంధువులు దాదాపు నాలుగు లక్షల రూపాయలు వరకూ కానుకలుగా ఇచ్చారు. దానిలో 3.2 లక్షలు ఎన్నికల్లో ఖర్చయ్యాయి మిగిలిన డబ్బుతో ఒక సెకండ్ హ్యాండ్ మారుతీ కారు కొనుక్కున్నాను. 1994లోనూ నాకే సీటు రావడంతో పోటీ చేశాను. ఆ ఎన్నికల్లో 3 లక్షల రూపాయలు, తరువాత 1999 నాటి ఎన్నికల్లో సుమారు 3 లక్షల రూపాయలు ఎన్నికలకు ఖర్చయ్యాయి. 2004లో ఎంపీగా సీటు రావడంతో పోటీ చేసి గెలుపొందాను. ఈ ఎన్నికల్లో సుమారు 12 లక్షల రూపాయలు ఖర్చయింది. ఈ ఐదు ఎన్నికల్లో సుమారు మొత్తం 23 లక్షల 20 వేల రూపాయలు వరకూ ఖర్చయింది. తరువాత టీడీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఛైర్మన్‌గానూ, పార్లమెంటరీ కమిటీ సభ్యునిగా, దేవ దేవుడు తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మన్‌గా దేవునికి సేవ చేసుకునే అవకాశం లభించడం నా పూర్వ జన్మసుకృతం. తరువాత ఎమ్మెల్సీగా ప్రజలకు సేవ చేసుకునే అదృష్టం వచ్చింది.

ఓటర్లలో మార్పు వచ్చింది...వ్యక్తిగత విమర్శలు పెరిగాయి

ఓటర్ల మనోగతంలో మార్పు వచ్చింది. గతంలో అయితే మా గ్రామానికి ఏం చేస్తారు, ఏ విధంగా అభివృద్ధి చేస్తారు అనేవారు. వ్యక్తిగత ప్రయోజనాలకు తావు ఉండేది కాదు. అలాగే అప్పటి ఎన్నికల్లో వ్యక్తిగత విమర్శలు ఉండేవి కావు. నైతిక విలువలు, సిద్ధాంతాలతో ముందుకు సాగేవాళ్లం. ఇప్పుడు డబ్బు ప్రాధాన్యం పెరిగిపోయింది. ఎన్నికల్లో పోటీ చేసే వారు ఎన్ని రూ.కోట్లు ఖర్చు పెట్టగలరనేది ప్రామాణికంగా మారింది.

కూటమి పార్టీల్లో చేరేందుకు ఉత్సాహంగా..

రాష్ట్ర ప్రజల అభ్యున్నతి కోసం కూటమిగా ఏర్పడిన టీడీపీ, జనసేన, బీజేపీల్లో చేరేందుకు ప్రస్తుతం యువతతోపాటు అన్నివర్గాల ప్రజలు చాలా ఉత్సాహంగా ముందుకువస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో 'కూటమి' అభ్యర్థుల విజయం ఖాయం.

● ఎలమంచిలి

ప్రజలను కంటికి రెప్పలా చూసుకుంటా

జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయకుమార్



కట్టుపాలెంలో కూటమి పార్టీల నేతలకు హారతులు పడుతున్న మహిళలు

ఎలమంచిలి, ఏప్రిల్ 27: నియోజకవర్గ ప్రజలను కంటికి రెప్పలా చూసుకుంటానని, నియోజకవర్గాన్ని అగ్ర భాగాన ఉండేలా అభివృద్ధి పరుస్తానని జనసేన అసెంబ్లీ అభ్యర్థి సుందరపు విజయకుమార్ అన్నారు. శనివారం సుందరపు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, పార్లమెంటు అభ్యర్థి సీఎం.రమేశ్ సోదరుడు సీఎం. రాజేష్, కూటమి పార్టీల నేతలతో కలిసి మునిసిపాలిటీ కట్టుపాలెం, తెరువుపల్లి వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కట్టుపాలెంలో బీఆర్.అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కూటమి పార్టీల నేతలకు మహిళలు హారతులు పట్టారు. ఈ సందర్భంగా ప్రచార రథంపై నుంచి ప్రజలనుద్దేశించి సుందరపు మాట్లాడుతూ అభివృద్ధి అంటే స్వర్గీయ ఎన్టీఆర్ కిలో 2 రూపాయల బియ్యం పథకం ప్రవేశపెట్టి ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. నియోజవర్గంలో 13 ఏళ్లుగా ప్రజల మధ్యనే ఉంటూ ప్రజా సేవ చేస్తున్నానని అన్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజారంజక పాలన సాగాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని, కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు. పార్లమెంటు అభ్యర్థి సీఎం రమేశ్‌కు కమలం గుర్తుపైన, అసెంబ్లీ అభ్యర్థి సుందరపు విజయ్‌కుమార్‌కు గాజుగ్లాసు గుర్తుపైన ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కూటమినేతలు కొఠారు సాంబ, పండూరి శ్రీను, బొద్దపు శ్రీను, గొర్లె నానాజీ, లవుడు లోవరాజు, పప్పు ఈశ్వరావు, పిట్టా దాసుబాబు, నక్కా శివశంకర్, కరణం రవి, చిట్టిబాబు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి కూటమితోనే సాధ్యం

టీడీపీ అభ్యర్థిని వంగలపూడి అనిత

పాయకరావుపేట రూరల్, ఏప్రిల్ 27: రాష్ట్రాభివృద్ధి ఎన్‌డీఏ కూటమితోనే సాధ్యమని టీడీపీ అభ్యర్థిని వంగలపూడి అనిత అన్నారు. మండలంలోని కందిపూడి, రాజగోపాలపురం, కుమారపురం గ్రామాలలో శనివారం ఆమె ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలు, పెన్షన్ పెంపు, 50 సంవత్సరాలకే బీసీలకు పింఛను తదితర వాటిని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నేతలు పెదిరెడ్డి చిట్టిబాబు, బొంది కాశీవిశ్వనాథం, తోట నగేశ్, ఎగదాసు నానాజీ, గూటూరు శ్రీనివాసరావు, పెదిరెడ్డి శ్రీను, గొర్రెల రాజుబాబు, మజ్జూరి నారాయణరావు, మహేశ్‌రెడ్డి పాల్గొన్నారు.



కుమారపురంలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న వంగలపూడి అనిత

గెలిపిస్తే.. అణుకుకి తారు రోడ్డు వేయిస్తా

గిరిజనులకు అనిత తనయుడు నిఖిల్ హామీ

కోటవురట్ల, ఏప్రిల్ 27: మండలంలోని గొట్టివాడ శివారు అణుకు గిరిజన గ్రామంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిని వంగలపూడి అనిత తనయుడు నిఖిల్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. శనివారం రాత్రి గ్రామంలో ఇంటింటికి తిరిగి తన తల్లి అనితకు సైకిల్ గుర్తుపైన, బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌కు కమలం గుర్తుపైనా ఓటు వేసి గెలిపించాలని కోరారు. చంద్రబాబునాయుడు సీఎం అయితే నెలకు రూ.4వేలు పింఛన్, ప్రతి మహిళకు నెల రూ.1,500, ఏడాది మూడు గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తారన్నారు. అణుకు గ్రామానికి తారురోడ్డు వేసే బాధ్యత అమ్మ తీసుకుంటుందని ఆయన గిరిజనులకు హామీ ఇచ్చారు. అమ్మ మాటగా నన్ను చెప్పమని చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు సుంకర బాబ్జీ, బండి రమణ, రాచపతి బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.



అణుకులో ఎన్నికల ప్రచారం చేస్తున్న అనిత తనయుడు నిఖిల్



అసకపల్లి సున్నంబట్టీల వద్ద మాట్లాడుతున్న పంచకర్ల రమేశ్‌బాబు

జగన్ పాలనకు చరమగీతం పాడాలి

జనసేన పార్టీ పెందుర్తి నియోజకవర్గ అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు

సబ్బవరం, ఏప్రిల్ 27: సీఎం జగన్ అరాచక పాలనకు ప్రజలంతా చరమగీతం పాడాలని జనసేన పార్టీ పెందుర్తి నియోజకవర్గ అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు విజ్ఞప్తి చేశారు. శనివారం ఆయన టీడీపీ పెందుర్తి ఇన్‌చార్జి గండి బాబ్జీ, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్‌తో కలసి అసకపల్లి శివారు సున్నంబట్టీలు వద్ద పసలతల్లి అమ్మవారిని దర్శించుకుని ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా సున్నం బట్టీలు, జాగారపువానిపాలెం, పల్లవానిపాలెం, గాలిభీమవరం, నాయనమ్మపాలెం, టెక్కలిపాలెం, రాపురఅగ్రహారం, వంగలి గ్రామాల్లోని మహిళలు ఆయనకు మంగళహారతులిచ్చి ఘనంగా స్వాగతం పలికారు. ఆయా గ్రామాల్లో పంచకర్ల మాట్లాడుతూ అన్ని రంగాలను సర్వనాశనం చేసిన రాష్ట్రం గాడిలో పడాలంటే చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. కూటమి విజయం చారిత్రక అవసరమన్నారు. వైసీపీని మించిన సంక్షేమ పథకాలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. సామాజిక పింఛన్లు రూ.నాలుగు వేలు, దివ్యాంగుల పెన్షన్లను రూ.ఆరు వేలకు పెంచడం జరుగుతుందన్నారు. అలాగే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, 15 నుంచి 50 ఏళ్లలోపు మహిళలకు నెలకు రూ.1500, 50 ఏళ్లు దాటిన వారికి పింఛన్ వంటి పథకాలను అమలులోకి తెస్తామన్నారు. ఎమ్మెల్యేగా తనకు గాజు గ్లాసు గుర్తుపై, అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌కు కమలం గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. గండి బాబ్జీ మాట్లాడుతూ వైసీపీ నేతల కల్లిబొల్లి మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని, దోపిడీ చేసిన సొమ్ము వారివద్ద పుష్కలంగా ఉందని, వారిచ్చిన డబ్బులు తీసుకుని కూటమి అభ్యర్థులకు ఓట్లు వేయాలని సూచించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు బాబూరావు, గండి వంశీ, కర్రి కనకరాజు, నరసింగరావు, బలిరెడ్డి అప్పారావు, వి.గోవింద, పి.శ్రీను, పి.రమణ, పి.అప్పలనాయుడు, ఎ.గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

మహిళా కూలీలతో మమేకమైన పంచకర్ల సతీమణి మహాలక్ష్మి

పెందుర్తి: జనసేన పార్టీ పెందుర్తి నియోజవర్గ అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు సతీమణి మహాలక్ష్మి ఉపాధి మహిళా కూలీలతో మమేకమై ప్రచారం చేశారు. మండలంలోని వాలిమెరక, ముదపాకలో ఉపాధి హామీ పథకం పనులు చేస్తున్న కూలీలతో ఆమె మాట్లాడడమే కాకుండా వారి నెత్తిన మట్టితట్టను ఎత్తి సాయపడ్డారు. తట్ట ఎత్తి మీకు సాయపడ్డా.. గంపగుత్తిగా ఓట్లు వేసి తన భర్తను గెలిపించాలని కోరారు. అనంతరం వారికి మేనిఫెస్టో కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ పెందుర్తి ఇన్‌చార్జి శ్రీనివాసులనాయుడు, మాజీ ఎంపీపీ రెడ్డి వరలక్ష్మి, నాయకులు అయిత సింహాచలం, రెడ్డి నారాయణరావు, కునుకంటి కనకరాజు, ఎర్రా సత్యనారాయణ, శివకిరణ్ సంతోష్, కె.రాముని నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



మహిళా కూలీ నెత్తిన మట్టి తట్ట పెడుతున్న మహాలక్ష్మి

మండుతున్న ఎండలు



నిర్మానుష్యంగా ఉన్న పరవాడ ప్రధాన రహదారి

పరవాడ, ఏప్రిల్ 27 : మండల కేంద్రం పరిసర ప్రాంతాల్లో ఎండల తీవ్రత కొనసాగుతోంది. మునుపెన్నడూ లేని విధంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. శనివారం 41 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఎండ తీవ్రత కొనసాగింది. ఎండలకు తోడు వడగాడ్పులు వీయడంతో ప్రజలు అల్లాడిపోయారు. మరోపక్క ఉక్కపోత తోడవ్వడంతో నానా అవస్థలు పడ్డారు. ఎండలు కారణంగా ఉదయం పది గంటలకే ప్రధాన రహదారులన్నీ నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. నిత్యం రద్దీగా ఉండే పరవాడ ప్రధాన రహదారి ఎండ కారణంగా బోసిపోయింది. మండల కేంద్రానికి వివిధ పనులపై వచ్చే వారు ఎండలకు భయపడి రాకపోవడంతో దుకాణ సముదాయాలన్నీ వెలవెలబోయాయి. మున్ముందు ఎండల తీవ్రత ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఎలమంచిలిలో.. మండుతున్న ఎండలను జనం తట్టుకోలేక పోతున్నారు. ఎండ వేడిమికి జనం ఆపసోపాలు పడుతున్నారు. ఉదయం 9 గంటల నుంచే గాడ్పులతో కూడిన వాతావరణం ఉండడంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. వ్యాపార సముదాయాలు, మార్కెట్లు ఎండల ధాటికి కొనుగోలుదారులు లేక బోసిపోతున్నాయి. ప్రధాన రోడ్లతోపాటు జాతీయ రహదారిపైన నిర్మానుష్య వాతావరణం కనిపిస్తున్నది. ఎండల ధాటిని తట్టుకోలేక కొందరు వాహనాలను హైవే పక్కనే నిలుపుదల చేసి సేద తీరుతున్నారు. ఇదే పరిస్థితి మరిన్ని రోజులు కొనసాగితే పరిస్థితి దారుణంగా ఉంటుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

బంగారు భవిష్యత్తు కావాలంటే జగన్ ఇంటికి పోవాలి

» అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్

ఎస్.రాయవరం, ఏప్రిల్ 27: రానున్న రోజుల్లో ప్రజలకు బంగారు భవిష్యత్తు కావాలంటే జగన్ రెడ్డి ఇంటికి వెళ్లిపోవాలని అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలతో ఆయన సమావేశమయ్యారు. వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం వలన జరిగిన నష్టాన్ని ప్రజలకు వివరించారు. కేంద్రం ప్రభుత్వం అందిస్తున్న పథకాలను తాను ఇస్తున్నట్టుగా ముఖ్యమంత్రి జగన్ చెప్పుకుంటున్నారన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రతినిధిగా వచ్చిన తనను గెలిపిస్తే పలు అభివృద్ధి పనులతోపాటు పరిశ్రమలను తీసుకొచ్చి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్టు రమేశ్ తెలిపారు. అంతకముందు ఉపాధి కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా పీజీ, బీటెక్, నర్సింగ్ చదివి ఉద్యోగాలు లేక అక్కడ ఉపాధి పనులు చేస్తున్న కసిరెడ్డి గోవిందరావు, యాదగిరి పవిత్ర, జాగు సాయిశ్రీలతో సీఎం రమేశ్ మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకొని, ఆ ముగ్గురికి ఉద్యోగాలు వేయించనున్నట్టు హామీ ఇచ్చారు. ఈ ఎన్నికల్లో కమలంపై ఓటు వేసి తనను, సైకిల్‌పై ఓటు వేసి అనితను గెలిపించాలని రమేశ్ కోరారు. అంతకముందు గ్రామానికి వచ్చిన సీఎం రమేశ్‌కు బీజేపీ, జనసేన, టీడీపీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పి. రవిరాజు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి, జనసేన నేత పులి సత్తిబాబు, కూటమి నేతలు పాల్గొన్నారు.



అనకాపల్లిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రమేశ్

అనకాపల్లి పట్టణాభివృద్ధే లక్ష్యం

అనకాపల్లి టౌన్ : అనకాపల్లి పట్టణాభివృద్ధికి కృషి చేస్తానని బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి సీఎం రమేశ్ అన్నారు. శనివారం స్థానిక వేల్పులవీధి సీతారామకల్యాణ మండపంలో పట్టణానికి చెందిన ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు, చిరు వ్యాపారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనిటీ భవనం గురించి ఆర్యవైశ్య కమిటీ సభ్యులు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే భవనాన్ని పూర్తి చేసేలా ప్రయత్నం చేస్తామన్నారు. సంక్షేమ పథకాలతోపాటు సభ్యులు సూచించిన ఇతర విషయాలను పరిశీలిస్తామన్నారు. చిరు వ్యాపారులకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ముద్ర పథకం ద్వారా రుణాలిచ్చి ప్రోత్సహిస్తామన్నారు. తొలిసారిగా ఈ పథకం అనకాపల్లిలో అమలు చేసేలా చర్యలు తీసుకుంటానన్నారు. చిరు వ్యాపారుల సంఘం సభ్యులు మాట్లాడుతూ కూటమి అభ్యర్థులకే తమ సంపూర్ణ మద్దతు అని ప్రకటించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్, వజ్రపు మహేశ్వరరావు, బొడ్డు లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

గెలుపు మనదే

నక్కపల్లి: ఈ ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి విజయం సాధించడం ఖాయమని, మరో 15 రోజులు కష్టపడి పనిచేయాలని అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ అన్నారు. శనివారం స్థానికంగా వున్న అనిత నివాసానికి ఆయన వచ్చారు. అనంతరం అనిత, టీడీపీ నాయకులతో కాసేపు మాట్లాడారు. బీజేపీ, జనసేన, టీడీపీ కూటమి ప్రభంజనం సృష్టిస్తుందని చెప్పారు. ఇందులో ఎటువంటి అనుమానం లేదన్నారు. ఆయనను కలిసిన వారిలో టీడీపీ నాయకులు కొప్పిశెట్టి కొండబాబు, వెంకటేశ్, జానకి శ్రీను, కొప్పిశెట్టి బుజ్జి, నల్లపురాజు వెంకట్రాజు పాల్గొన్నారు.

'పేట'లో కూటమి అభ్యర్థుల ఎన్నికల ప్రచారం

» కూటమి పార్టీల జెండాలతో నిండిన వీధులు

» పోటెత్తిన టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు

పాయకరావుపేట, ఏప్రిల్ 27 : రానున్న ఎన్నికల్లో అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం.రమేశ్, పాయకరావుపేట టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిని వంగలపూడి అనిత శనివారం పట్టణంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టణంలో ఏటి ఒడ్డు వీధి నుంచి మంగవరంరోడ్డు శివారు వరకు పలు వీధుల్లో ఎన్నికల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి రానున్న ఎన్నికల్లో తమకు ఓట్లేసి గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వారికి మహిళలు హారతులిచ్చి బ్రహ్మరథం పట్టారు. దీంతో ఈ వీధులన్నీ టీడీపీ, జనసేన, బీజేపీ జెండాలలో నిండిపోయాయి. చేనేత సొసైటీని సందర్శించిన సీఎం.రమేశ్ చేనేత కార్మికుల సమస్యలు తెలుసుకుని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎంపీ అభ్యర్థి సీఎం.రమేశ్‌ని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ తోట నగేశ్ ఆధ్వర్యంలో పలువురు ఘనంగా సత్కరించారు. ఏటి ఒడ్డు వీధికి చెందిన 20 కుటుంబాలు, వార్డు సభ్యుడు దాసరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఐదు కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరందరికి టీడీపీ అభ్యర్థిని వి.అనిత కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి, టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, పట్టణ పార్టీ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, గూటూరు శ్రీనివాసరావు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం.రమేశ్

'వైసీపీ మేనిఫెస్టోలో దివ్యాంగులకు మొండిచేయి'

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 27 : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి శనివారం ప్రవేశపెట్టిన మేనిఫెస్టోలో దివ్యాంగులకు మొండిచేయి చూపారని విభిన్న ప్రతిభావంతుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పాత్రపల్లి వీరు యాదవ్ అన్నారు. శనివారం సాయంత్రం ఉడ్‌పేట వద్ద దివ్యాంగులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేనిఫెస్టోలో దివ్యాంగుల సంక్షేమం గురించి గాని, పెన్షన్ గురించి పొందుపరచకపోవడం నిజంగా హేయమైన చర్యగా భావిస్తున్నామన్నారు. గడిచిన ఐదేళ్లలో జగన్మోహన్‌రెడ్డి దివ్యాంగులను విస్మరించారన్నారు. దివ్యాంగుల సంక్షేమాన్ని, పెళ్లికానుక, స్వయం ఉపాధికి రుణాలు, విద్య, ఉద్యోగావకాశాలు కల్పించలేకపోయారన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు కోరుకొండ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 27: పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఈపీడీసీఎల్ ఈఈ కె. రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ నిర్వహణ పనుల్లో భాగంగా సాగిసుబ్బరాజువీధి, గౌరీసంఘం, సతకంపట్టు, మహిళా కళాశాల, దిబ్బవీధి, రైతు సంఘం, దాడి భోగలింగం వీధి, గంగిరేవిచెట్టు, అరుంధతినగర్‌ల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

హైస్కూల్ అభివృద్ధికి సహకరిద్దాం

» వేంపాడు హైస్కూల్ పూర్వ విద్యార్థులు నిర్ణయం



సమావేశమైన పూర్వ విద్యార్థులు

నక్కపల్లి, ఏప్రిల్ 27: మండలంలోని వేంపాడు జడ్పీ హైస్కూల్‌లో 2003-04 విద్యా సంవత్సరంలో టెన్త్ చదువుకున్న పూర్వ విద్యార్థుల బృందం 20 ఏళ్ల తరువాత శనివారం ఆత్మీయ సమావేశంలో కలిశారు. ఆ నాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఎంతో ఉత్సాహంగా గడిపారు. తాము చదువుకున్న హైస్కూల్ అభివృద్ధికి సహకరించాలని నిర్ణయించుకున్నారు. పేద విద్యార్థులను చదివించాలని, పాఠశాల అభివృద్ధికి సహకరించాలని నిర్ణయించారు.

ఓటింగ్ శాతం పెరిగేలా చూడాలి

... 5వ పేజీ తరువాయి

జనరల్ అబ్జర్వర్ డాక్టర్ రాకేశ్‌కుమార్, కె.మోహన్, ఎం.రహికర్, జేసీ జాహ్నవి, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఆర్వోలు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బి.తాతయ్యబాబు, గొర్లె సూరిబాబు (వైసీపీ), జి.చిన్నారావు (బీఎస్పీ), కె.హరినాథబాబు (ఆమ్‌ఆద్మీ), అల్లు రాజు (సీపీఎం), వి.రమేశ్ (బీజేపీ) తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్ సెంటర్ ఏర్పాట్ల పరిశీలన

జిల్లా ఎన్నికల పరిశీలకుడు దల్జీత్‌సింగ్ మంగత్ శనివారం కలెక్టరేట్‌లో ఈవీఎంల గోదామును, కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవీఎంల రిజిష్టర్లను ఆయన తనిఖీ చేశారు. ఆయన వెంట కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఎస్పీ కేవీ.మురళీకృష్ణ, జేసీ జాహ్నవి తదితరులు ఉన్నారు.

నెత్తురోడిన రహదారి

... 5వ పేజీ తరువాయి

దూరంలో గల వెదుళ్లపాలెం వద్ద అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని తుని నుంచి నక్కపల్లి వైపు వచ్చే మార్గంలోకి వెళ్లింది. అదే సమయంలో తుని నుంచి అడ్డరోడ్డు వైపు వస్తున్న ట్రాలర్ లారీ కిందకు కారు దూసుకుపోయింది. దీంతో కారు టాప్ లేచిపోయింది. కారు నడుపుతున్న వికాస్ తీవ్రంగా గాయపడగా, అతని కళ్ల ముందే వికాస్ తల్లి వెంకటలక్ష్మి (43), వికాస్ మేనల్లుడు దాడి గగన్ (15), వికాస్ స్నేహితుడు సుంకర మధుకర్ (22) మృతిచెందారు. ఈ ముగ్గురి శరీరాలు ఛిద్రమయ్యాయి. తీవ్రంగా గాయపడిన వికాస్‌ను అనకాపల్లి ఆస్పత్రికి తరలించారు.

ఆస్పత్రి వద్ద ఆర్తనాదాలు

విషయం తెలిసిన వెంటనే వారి కుటుంబసభ్యులు సంఘటనా స్థలానికి, నక్కపల్లి ఆస్పత్రికి చేరుకున్నారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన సుంకర మధుకర్ బీటెక్ చదివి స్టీల్‌ప్లాంటులో అప్రెంటీస్ చేస్తున్నాడు. మరో రెండు నెలల్లో ఎంఎస్ చేసేందుకు జర్మనీ వెళ్లాల్సి ఉందని, ఈలోగానే ఊహించని ప్రమాదం ముంచుకొచ్చిందని అతని తల్లిదండ్రులు సుశీల, మోహన్ కన్నీరుమున్నీరయ్యారు. ఇదే ప్రమాదంలో మృతిచెందిన బాలుడు గగన్ కొద్దిరోజుల కిందటే తొమ్మిదో తరగతి పరీక్షలు రాసి టెన్త్‌లోకి వచ్చాడు. తమ బంధువులతో కలిపి కారులో వెళుతున్నట్టు ముందు తమకు చెప్పలేదని, అగనంపూడి టోల్‌గేట్ దాటాక తమకు విషయం తెలిసిందంటూ తల్లిదండ్రులు దాడి కిషోర్, వరలక్ష్మి భోరుమన్నారు. తీవ్రంగా గాయపడిన వికాస్ ఇంజనీరింగ్ చదివాడు. రెండు నెలల్లో అమెరికా వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకున్నట్టు అతని తండ్రి నరసింగరావు చెప్పారు. తన జీవిత భాగస్వామి వెంకటలక్ష్మి కారులో రక్తపు మడుగులో నిర్జీవంగా ఉన్న దృశ్యాన్ని చూసి ఆయన కన్నీటి పర్యంతమయ్యారు. ఈ ప్రమాదానికి గురైన వారంతా అనకాపల్లి జిల్లా వైసీపీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్‌కు బంధువులు కావడంతో ఆయన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. జనసేన నేత గెడ్డం బుజ్జి నక్కపల్లి ఆస్పత్రికి వచ్చి మృతుల బంధువులను పరామర్శించారు. మృతదేహాలకు నక్కపల్లి ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. ఈ సంఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ విజయ్‌కుమార్ చెప్పారు.



ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు

మండలంలో డీఈఓ పర్యటన



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

అచ్యుతాపురం, ఏప్రిల్ 27: మండలంలో జిల్లా విద్యాశాఖాధికారిని ఎం.వెంకటలక్ష్మమ్మ శనివారం పర్యటించారు. తొలుత 2024-25 విద్యాకానుక కిట్లు స్టాక్ పాయింట్‌కు కేటాయించిన స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలను పరిశీలించారు. అనంతరం మండల స్థాయిలో విద్యాకానుక కమిటీలు, స్టాక్‌పాయింట్ నిర్వహణపై వివరాలు తెలుసుకొని సంతృప్తిచెందారు. అనంతరం స్థానిక కస్తూర్బా విద్యాలయంలో జరుగుతున్న ఇంటర్మీడియట్ రెమిడియల్ తరగతులు పరిశీలించారు. వేసవిలో విద్యార్థులు తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వివరించారు. ఆమె వెంట ఎంఈఓ సీఆర్‌కే దేవరాయలు ఉన్నారు.

గ్రంథాలయానికి కొత్త పుస్తకాలు

అచ్యుతాపురం, ఏప్రిల్ 27: గ్రంథాలయానికి కొత్త పుస్తకాలు త్వరలో సరఫరా చేస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్. వెంకటరమణ అన్నారు. శనివారం ఆయన స్థానిక గ్రంథాలయంలో 2023-24 రికార్డులను పరిశీలించారు. అలాగే త్వరలో గ్రంథాలయానికి రావలసిన సెస్‌ను పంపిస్తామన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి బి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పశువుల ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలి

రాంబిల్లి, ఏప్రిల్ 27 : వేసవిలో పశువుల ఆరోగ్యం పట్ల పాడి రైతులు మరింత జాగ్రత్తగా ఉండాలని బీసీటీ కేవీకే పశు వైద్య శాస్త్రవేత్త డాక్టర్ విజయ రాజ్ఞి అన్నారు. శనివారం రజాల హరిజన కాలనీలో హరిపురం బీసీటీ కృషి విజ్ఞానకేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచ పశు వైద్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పశువుల ఆరోగ్యాన్ని కాపాడడంలో పశు వైద్యుని పాత్ర ఎంతో ఉందన్నారు. ప్రపంచాన్ని భయపెట్టిన కరోనా టీకాను కూడా కనిపెట్టినది ఒక పశు వైద్యుడన్నారు. ఈ సందర్భంగా వంద పశువులకు నట్టల నివారణ మందులు వేశారు. కార్యక్రమంలో బీసీటీ కేవీకే సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శైలజాకుర్రా, కమ్యూనిటి ఆర్గనైజర్లు నాయుడు, నాగేశ్వరరావు, మహిళా పాడిరైతులు పాల్గొన్నారు.

వెల్చూరు సర్పంచ్ జనసేనలో చేరిక



వెల్చూరు సర్పంచ్ కిల్లాడ మంగయ్యమ్మ, కుమారుడు చినబాబు, అనుచరులతో కలిసి జనసేనలో చేరిన దృశ్యం

రాంబిల్లి, ఏప్రిల్ 27: మండలంలోని వెల్చూరు సర్పంచ్ కిల్లాడ మంగయ్యమ్మ, కుమారుడు కిల్లాడ చినబాబు అనుచరులతో వైసీపీని వీడి శనివారం జనసేన పార్టీలో చేరారు. వారందరికీ ఎలమంచిలి జనసేన అభ్యర్థి సుందరపు విజయకుమార్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సుందరపు మాట్లాడుతూ.. కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డి.రంగనాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే కన్నబాబురాజు ఐదేళ్ల పాలనలో ప్రజలకు చేసింది ఏమిలేదని, ఆయన మాత్రం అన్నివిధాల అభివృద్ధి సాధించారని ఆరోపించారు. ఎన్నికల్లో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయకుమార్‌కు గాజుగ్లాసు గుర్తుపైన, ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌కు కమలం గుర్తుపైన ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఎం రాజేశ్, టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు వి.దినబాబు, పప్పల నూకన్నదొర, భైలపూడి శ్రీరామదాసు, ధూళి రంగనాయకులు, డీఎస్ఎన్‌రాజు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి రూ.లక్ష చెక్కు పంపిణీ



మృతురాలి తల్లి రాధకు నగదు చెక్కును అందజేస్తున్న ఎస్పీ

అనకాపల్లి రూరల్, ఏప్రిల్ 27: నక్కపల్లి పోలీస్‌స్టేషన్‌లో మహిళా కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ ఇటీవల మృతి చెందిన దుర్గాభవాని కుటుంబానికి శనివారం లక్ష రూపాయలు చెక్కును ఎస్పీ కేవీ మురళీకృష్ణ అందజేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మృతురాలి తల్లి చందక రాధకు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ విజయభాస్కర్, ఏఆర్ డీఎస్పీ నాగేశ్వరరావుపాల్గొన్నారు.

ప్రశాంతంగా పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 27 : పట్టణంలో శనివారం పాలిటెక్నిక్ ప్రవేశపరీక్ష ప్రశాంతంగా జరిగింది. అనకాపల్లిలోని పలు కళాశాలల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించారు. అనకాపల్లిలోని 16 కేంద్రాల్లో జరిగిన ఈ పరీక్షలకు 6,742 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 6,323 మంది విద్యార్థులు హాజరైనట్టు అనకాపల్లి పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తెలిపారు.

మాసాహెబ్‌పేటలో పలువురు టీడీపీలో చేరిక

పాయకరావుపేట రూరల్, ఏప్రిల్ 27: మండలంలోని మాసాహెబ్‌పేట గ్రామానికి చెందిన పలువురు శనివారం టీడీపీలో చేరారు. గ్రామానికి చెందిన కొంతం గంగారావు, కొంతం సాయి, వెలుగుల ప్రసాద్, కంకిపాటి శివశంకర్, కంకిపాటి రాజుగణేష్, కంకిపాటి కోటిబాబు, ముదపాక రమణ, ముదపాక అశోక్, మాసా శ్రీను, ఒతాకుమర్తి లోవరాజు, పారుపల్లి శివాజీ, గెడ్డమూరి నాగేశ్వరరావు ఉపేంద్ర, తదితరులు వైసీపీని వీడి ఎమ్మెల్యే అభ్యర్థిని వంగలపూడి అనిత సమక్షంలో టీడీపీలో చేరారు. వీరిని అనిత కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, క్లస్టర్ ఇన్‌చార్జి కంకిపాటి వెంకటేశ్వరరావు, యాళ్ల వరహాలు, కంకిపాటి రమణ, వెలుగుల నూకరాజు, శ్రీమంతుల నాగచక్ర, కంకిపాటి సంజీవి పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

పరవాడ, ఏప్రిల్ 27 : సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పరవాడ సీఐ బాల సూర్యారావు సూచించారు. శనివారం ఆయన తాడి గ్రామస్థులతో సమావేశమయ్యారు. సైబర్ నేరాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి అవగాహన కల్పించారు. గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తే వెంటనే తమకు సమాచారమివ్వాలన్నారు. ఎన్నికల నేపథ్యంలోఎక్కడైనా మద్యం అక్రమ నిల్వలు ఉంటే తక్షణమే తమకు తెలియజేయాలన్నారు.

టెన్త్ విద్యార్థినులకు అభినందన

పాయకరావుపేట, ఏప్రిల్ 27 : ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన జడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థినులను శనివారం పలువురు ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జడ్పీ బాలికోన్నత పాఠశాల హెచ్ఎం భవానీతోపాటు విద్యార్థినులను ఎంఈఓలు కేఎన్.గాంధీ, రమేష్‌బాబు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నం నియోజకవర్గం

వేతనాల కోసం ఎదురుచూపు

నాలుగు నెలలుగా అందని వైనం

ఎలా బతకాలంటూ ప్రశ్నిస్తున్న ఆర్‌బీకే టెక్నికల్ అసిస్టెంట్లు, డేటా ఆపరేటర్లు, హెల్పర్లు

నాతవరం, ఏప్రిల్ 27: మండలంలో రైతుభరోసా కేంద్రాలలో పనిచేసే టెక్నికల్ అసిస్టెంట్స్, డేటా ఆపరేటర్లు, హెల్పర్లు వేతనాల కోసం ఎదురుచూస్తున్నారు. గత ఏడాది డిసెంబరు నెల నుంచి ఈ ఏడాది మార్చి వరకు టెక్నికల్ అసిస్టెంట్స్‌కు నెలకు రూ.15వేలు, డేటా ఆపరేటర్లకు నెలకు రూ.12వేలు, హెల్పర్లకు నెలకు రూ.10వేలు చొప్పున చెల్లించాల్సి ఉంది. టెక్నికల్ అసిస్టెంట్స్ ధాన్యంలో తేమ శాతం తదితర విషయాలను చూడగా.. డేటా ఆపరేటర్లు ధాన్యం ఏ మిల్లుకు పంపాలి విషయాలను చూశారు. అయితే వీరికి నాలుగు నెలల వేతనాలను ప్రభుత్వం విడుదల చేసినప్పటికీ జిల్లా సివిల్ సప్లయి కార్యాలయ అక్కౌంట్‌లకు వేస్తే రిజక్టు అవుతున్నాయని చెబుతున్నారని వారు తెలిపారు. తమకు నాలుగు నెలల వేతనాలు ఇవ్వలేదని, తాము ఎలా బతకాలని వారు ప్రశ్నిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తమకు వేతనాలు వెంటనే విడుదల చేయాలని టెక్నికల్ అసిస్టెంట్స్, డేటా ఆపరేటర్లు, హెల్పర్లు కోరుతున్నారు.

ఒకటి నుంచి ఉచిత వేసవి శిక్షణ తరగతులు

మాకవరపాలెం, ఏప్రిల్ 27: మే ఒకటో తేదీ నుంచి ఉచిత వేసవి శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నట్టు గౌతమి లలితా కళా శిక్షణ కేంద్రం వ్యవస్థాపకుడు పి.రంగరాజు, కార్యదర్శి పి. శేషగిరిరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా, స్పోకెన్ ఇంగ్లీషు, చదరంగం, నృత్యం, గణితం, కరాటే విభాగాల్లో శిక్షణ ఇస్తామన్నారు. ఉదయం ఆరు నుంచి 11 గంటల వరకు,సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు శిక్షణ ఇస్తామన్నారు. ప్రతీ రోజూ శిక్షణలో పాల్గొనేవారికి అల్పాహారం అందజేస్తామన్నారు.

ఎన్నికల వేళ గుర్తొచ్చిన రోడ్డు విస్తరణ పనులు

- ఆరిలోవ అటవీ ప్రాంతంలో పనులకు నిధులు మంజూరు
- నిధులు మంజూరై 9 నెలలైనా ప్రారంభించని వైనం
- ఎన్నికల సమయంలో ఆదరాబాదరాగా పనులు ప్రారంభం



ఆరిలోవ అటవీ ప్రాంతంలో జరుగుతున్న తారురోడ్డు పనులు

గొలుగొండ, ఏప్రిల్ 27: ఎన్నికల వేళ ఆరిలోవ అటవీ ప్రాంతంలో రోడ్డు విస్తరణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ పనులకు 9 నెలల క్రితం నిధులను మంజూరు చేసిన సంబంధిత అధికారులు పనులు ప్రారంభించలేదు. మరో 15 రోజుల్లో ఎన్నికలు జరగనుండగా స్థానిక ఎమ్మెల్యే కాంట్రాక్టరుకు ఆర్థిక సహకారం అందించి శుక్రవారం పనులు ప్రారంభించారు. అయితే ఈ పనులు పూర్తి చేస్తారా? లేక మధ్యలోనే విడిచి పెడతారన్న అనుమానాలు ఆ ప్రాంతవాసుల్లో వ్యక్తమవుతున్నాయి. ఐదేళ్ల వైసీపీ పాలనలో గుర్తుకురాని ఆరిలోవ అటవీ ప్రాంతంపై ఎన్నికల వేళ ప్రేమ ఒలకపోస్తున్నారని మండిపడుతున్నారు.

మండలంలోని నర్సీపట్నం నుంచి కృష్ణాదేవిపేట వరకు 24 కిలోమీటర్లు రోడ్డు విస్తరణకు 2017లో రూ.24కోట్లు మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు మంజూరు చేశారు. అయితే రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేశారు. ఆరిలోవ అటవీ ప్రాంతంలో నాలుగు కిలోమీటర్లు అటవీ శాఖ అనుమతులు మంజూరులో ఆలస్యం కావడంతో నిలిచిపోయాయి. ఎర్రవరం రాజులబాబు గుడి నుంచి పప్పుశెట్టిపాలెం జంక్షన్ వరకూ రోడ్డు విస్తరణ జరగలేదు. అనంతరం వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పనులు ఆగిపోయాయి. ఆరిలోవ అటవీ ప్రాంతంలో అటవీ శాఖ అనుమతులు రెండున్నరేళ్ల క్రితం వచ్చాయి. ఈ రోడ్డు విస్తరణ పనులను ప్రస్తుత నర్సీపట్నం ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేష్ ప్రారంభించారు. రూ.కోటిన్నర పనులు చేసిన తర్వాత కాంట్రాక్టర్ బిల్లులు పెట్టగా మంజూరు కాలేదు. దీంతో పనులు సంబంధిత కాంట్రాక్టర్ నిలిపివేశారు. అయినా వైసీపీ ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదు. ఎన్నికల వేళ ఆ రోడ్డు విస్తరణ పనులను మళ్లీ ప్రారంభించారు. దీనిపై ఆర్‌అండ్‌బీ జేఈ ప్రసాద్ వద్ద ప్రస్తావించగా.. గత ఏడాదిలో చేపట్టిన రోడ్డు విస్తరణకు రూ.కోటిన్నర బిల్లులు ఆన్‌లైన్ చేశామన్నారు. బిల్లులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారన్నారు. కొత్త కాంట్రాక్టర్‌తో చేపట్టిన పనులు 15 రోజుల్లో పూర్తి చేస్తామన్నారు.

మండలంలో జోరుగా సారా తయారీ

- జీడి,మామిడి తోటల్లో డమ్ములతో సారా నిల్వలు
- ఎన్నికలకు మరింత సారా తయారీకి ఏర్పాట్లు
- ఇప్పటికే బెల్లం పులుసు సిద్ధం చేసిన తయారీదారులు
- నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్న సంబంధిత శాఖలు



భీమబోయినపాలెంలో నిల్వ చేసిన బెల్లం పులుసు

మాకవరపాలెం, ఏప్రిల్ 27: ఎన్నికల వేళ మండలంలో సారా ఏరులై పారుతోంది. ఎన్నికల దగ్గర పడుతున్న కొలదీ సారా తయారీ రోజు రోజూకు పెరుగుతోంది.సారా తయారీ సామగ్రి మండల కేంద్రం నుంచి మారుమూల గ్రామాలకు తరలిపోతోంది. అయినా సంబంధిత శాఖలు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే చాలా గ్రామాల్లో డ్రమ్ములతో సారాని నిల్వ చేశారు. మాకవరపాలెంలో సారా తయారీతోపాటు అమ్మకాలు పెద్ద ఎత్తున సాగుతున్నా ఎస్‌ఈబీ, పోలీసులు ఒక్క కేసు కూడా నమోదు చేయకపోవడం గమనార్హం. మాకవరపాలెం ఏలేరు కాలువ దగ్గర ఉన్న జీడిమామిడి తోటల్లో సారాని తయారు చేసి బసీ కాలనీ, యాతపేట వీధిల్లో ఏరులై పారిస్తున్నారు.

అలాగే భీమబోయినపాలెం,రామన్నపాలెం, చినరాచపల్లి, పైడిపాల, తూటిపాలతోపాటు మరికొన్ని గ్రామాల్లో సారా తయారీ పెద్ద ఎత్తున సాగుతున్నది.

ఎన్నికల దగ్గర పడుతున్న తరుణంలో సారా పులుసును తయారీ చేసి సిద్ధంగా ఉంచారు. సారా వ్యాపారం భారీగా సాగుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి సారా తయారీదారులపై చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని సందర్శించిన ఎన్నికల పరిశీలకుడు

నర్సీపట్నం, ఏప్రిల్ 27 : ఎన్నికల సాధారణ పరిశీలకుడు దల్జీత్ సింగ్ మంగత్ శనివారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయన్ని సందర్శించారు. కార్యాలయంలోని నోటీసు బోర్డులో ఉన్న ఎన్నికల సమాచారాన్ని పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలు, క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు, శాంతి భద్రతలు వివరాలను రిటర్నింగ్ అధికారి హెచ్‌వీ జయరాం, నర్సీపట్నం డీఎస్పీ మోహన్‌ని అడిగి తెలుసుకున్నారు. పోస్టల్ బ్యాలెట్‌కి దరఖాస్తు చేసుకున్న దివ్యాంగులు, 85 సంవత్సరాలు దాటిన వృద్ధులు ఎంత మంది ఉంటారని ప్రశ్నించారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీవో జయరాం ఆయనతో మొక్క నాటించారు.



ఆర్డీవో, డీఎస్పీలతో సమావేశమైన ఎలక్షన్ జనరల్ అబ్జర్వర్ దల్జీత్ సింగ్ మంగత్

ఓటింగ్ శాతం పెరిగేలా చూడాలి

... 5వ పేజీ తరువాయి

జనరల్ అబ్జర్వర్ డాక్టర్ రాకేశ్‌కుమార్, కె.మోహన్, ఎం.రహీకర్, జేసీ జాహ్నవి, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఆర్‌వోలు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బి.తాతయ్యబాబు, గొర్లె సూరిబాబు (వైసీపీ), జి.చిన్నారావు (బీఎస్పీ), కె.హరినాధబాబు (ఆమ్‌ఆద్మీ), అల్లు రాజు (సీపీఎం), వి.రమేశ్ (బీజేపీ) తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్ సెంటర్ ఏర్పాట్ల పరిశీలన

జిల్లా ఎన్నికల పరిశీలకుడు దల్జీత్‌సింగ్ మంగత్ శనివారం కలెక్టరేట్‌లో ఈవీఎంల గోదామును, కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవీఎంల రిజిష్టర్లను ఆయన తనిఖీ చేశారు. ఆయన వెంట కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఎస్పీ కేవీ.మురళీకృష్ణ, జేసీ జాహ్నవి తదితరులు ఉన్నారు.

నెత్తురోడిన రహదారి

... 5వ పేజీ తరువాయి



ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు

దూరంలో గల వెదుళ్లపాలెం వద్ద అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని తుని నుంచి నక్కపల్లి వైపు వచ్చే మార్గంలోకి వెళ్లింది. అదే సమయంలో తుని నుంచి అడ్డరోడ్డు వైపు వస్తున్న టాలర్ లారీ కిందకు కారు దూసుకుపోయింది. దీంతో కారు టాప్ లేచిపోయింది. కారు నడుపుతున్న వికాస్ తీవ్రంగా గాయపడగా, అతని కళ్ల ముందే వికాస్ తల్లి వెంకటలక్ష్మి (43), వికాస్ మేనల్లుడు దాడి గగన్ (15), వికాస్ స్నేహితుడు సుంకర మధుకర్ (22) మృతిచెందారు. ఈ ముగ్గురి శరీరాలు ఛిద్రమయ్యాయి. తీవ్రంగా గాయపడిన వికాస్‌ను అనకాపల్లి ఆస్పత్రికి తరలించారు.

ఆస్పత్రి వద్ద ఆర్తనాదాలు

విషయం తెలిసిన వెంటనే వారి కుటుంబసభ్యులు సంఘటనా స్థలానికి, నక్కపల్లి ఆస్పత్రికి చేరుకున్నారు. ఈ ప్రమాదంలో మృతిచెందిన సుంకర మధుకర్ బీటెక్ చదివి స్టీల్ ప్లాంటులో అప్రంటీస్ చేస్తున్నాడు. మరో రెండు నెలల్లో ఎంఎస్ చేసేందుకు జర్మనీ వెళ్లాల్సి ఉందని, ఈలోగానే ఊహించని ప్రమాదం ముంచుకొచ్చిందని అతని తల్లిదండ్రులు సుశీల, మోహన్ కన్నీరుమున్నీరయ్యారు. ఇదే ప్రమాదంలో మృతిచెందిన బాలుడు గగన్ కొద్దిరోజుల కిందటే తొమ్మిదో తరగతి పరీక్షలు రాసి టెన్త్‌లోకి వచ్చాడు. తమ బంధువులతో కలిపి కారులో వెళుతున్నట్టు ముందు తమకు చెప్పలేదని, అగనంపూడి టోల్‌గేట్ దాటాక తమకు విషయం తెలిసిందంటూ తల్లిదండ్రులు దాడి కిషోర్, వరలక్ష్మి బోరుమన్నారు. తీవ్రంగా గాయపడిన వికాస్ ఇంజనీరింగ్ చదివాడు. రెండు నెలల్లో అమెరికా వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకున్నట్టు అతని తండ్రి నరసింగరావు చెప్పారు. తన జీవిత భాగస్వామి వెంకటలక్ష్మి కారులో రక్తపు మడుగలో నిర్జీవంగా ఉన్న దృశ్యాన్ని చూసి ఆయన కన్నీటి పర్యంతమయ్యారు. ఈ ప్రమాదానికి గురైన వారంతా అనకాపల్లి జిల్లా వైసీపీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్‌కు బంధువులు కావడంతో ఆయన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. జనసేన నేత గెడ్డం బుజ్జి నక్కపల్లి ఆస్పత్రికి వచ్చి మృతుల బంధువులను పరామర్శించారు. మృతదేహాలకు నక్కపల్లి ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. ఈ సంఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ విజయ్‌కుమార్ చెప్పారు.

చోడవరం నియోజకవర్గం



పూజలు చేస్తున్న భక్తులు

వినాయక ఆలయంలో ప్రత్యేక పూజలు

రావికమతం, మార్చి 27: మండలంలోని టి.అర్జాపురం శ్రీ బాల వర సిద్ధి వినాయకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంకష్టహర చతుర్థి పర్వదినం సందర్భంగా శనివారం అర్చకులు గుంటూరు లక్ష్మణ శర్మ, రామారావుల ఆధ్వర్యంలో ఈ ప్రత్యేక పూజలు, పంచామృతా అభిషేకాలు నిర్వహించారు. విశేష సుగంధ ద్రవ్యాలతో శ్రీలక్ష్మీగణపతి హవనం (హోమం), నక్షత్ర శాంతి హోమం గ్రామదేతల శాంతి హోమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

1 నుంచి మార్షల్ ఆర్ట్స్‌లో ఉచిత శిక్షణ

చోడవరం, ఏప్రిల్ 27: మార్షల్ ఆర్ట్స్‌లో బాలబాలికలకు వచ్చే నెల ఒకటి నుంచి వేసవి ఉచిత శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్టు స్థానిక గణేష్ డిఫెన్స్ అకాడెమీ డైరెక్టర్ పుల్లేటి గణేష్ తెలిపారు. బాలబాలికలకు ఆత్మరక్షణ, క్రమశిక్షణ, ఏకాగ్రత తదితర అంశాలలో ఉపయోగపడే ఉషూ మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ ఇచ్చి, వారిని రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయి పోటీలకు హాజరయ్యేలా తీర్చిదిద్దుతామని చెప్పారు. బాలబాలికలు తమ ఆధార్ కార్డు జిరాక్స్, 2 పాస్ పోర్టు సైజ్ ఫొటోలతో 9642081090, 9390143949నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

ఎండుగడ్డికి కొరత



రోలుగుంటలో కొనుగోలు చేసి తీసుకువెళుతున్న ఎండి గడ్డి

రోలుగుంట, ఏప్రిల్ 23 : తీవ్ర వర్షాభావ పరిస్థితులతో ఎండి గడ్డికి తీవ్ర కొరత ఏర్పడింది. గత ఏడాది ఖరీఫ్‌లో తీవ్ర తుఫాన్‌తో వరి పొలాలకు తీవ్రనష్టం వాటిల్లింది. దీంతో ప్రస్తుత వేసవి నేపథ్యంలో పశుగ్రాసానికి తీవ్ర కొరత నెలకొన్నట్టు రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం బండి ఎండి గడ్డి రూ.3వేలు పైనే పలుకుతుందని అయినా దొరకడం లేదని అంటున్నారు. అలాగే ట్రాక్టర్ ఎండి గడ్డి రూ.5 నుంచి 6వేలకు పైనే ధర ఉందని రైతులు చెబుతున్నారు. మండలంలోని పలు గ్రామాల రైతులు దూర ప్రాంతాలు తిరిగి గడ్డిని కొనుగోలు చేసి తెచ్చుకుంటున్నారు. రానున్న రోజుల్లో ఎండిగడ్డికి మరింత గిరాకీ ఉంటుందని రైతులు అంటున్నారు.

చిరుజల్లులతో ఉపశమనం

మాడుగుల రూరల్/ మాడుగుల, ఏప్రిల్ 27: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం సాయంత్రం నాలుగుగంటలకు తేలికపాటి జల్లుల వర్షం పడింది. ఉదయం నుంచి ఎండతీవ్రత ఇబ్బంది ఎదుర్కొన్న జనాలకు సాయంత్రం వాతావరణంలో మార్పుతో ఉపశమనం పొందారు. ఆకాశం మేఘావృతమై చినుకులు కురవడంతో ఆనందం వ్యక్తంచేశారు. మాడుగుల కేంద్రంలో సాయంత్రం నాలుగు గంటలకు ఓ మోస్తారు తేలికపాటి జల్లు పడింది. మధ్యాహ్నం మూడు గంటల వరకు భానుడి ప్రతాపానికి నానా అవస్థలు పడిన ప్రజలు, తర్వాత వాతావరణం చల్లబడి తేలికపాటి జల్లు పడటంతో ఉపశమనం పొందారు.



మాడుగుల ప్రచార సభలో మాట్లాడుతున్న సీఎం రమేశ్



పాల్గొన్న కూటమి శ్రేణులు, ప్రజలు

'బూడి' కాజేసిన భూములు స్వాధీనం చేసుకుంటాం

- పరిశ్రమలు తీసుకువచ్చి యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తాం
- అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్

మాడుగుల, ఏప్రిల్ 27: ఉప ముఖ్యమంత్రి హోదాలో బూడి ముత్యాలనాయుడు కాజేసిన భూములన్నీ అధికారంలోకి వచ్చిన వెంటనే లాక్కొని అభివృద్ధి పనులకు ఉపయోగిస్తామని అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ పేర్కొన్నారు. శనివారం రాత్రి జరిగన ప్రచార కార్యక్రమంలో భాగంగా మాడుగుల బస్టాండ్‌లో ఆయన మాట్లాడారు. ఐదేళ్ల కాలంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని అన్నారు. సొంత చెల్లి పచ్చచీర కట్టుకుందని కామెంట్ చేసిన జగన్‌కి కనీసం సిగ్గుందా, ఏం భారతి పసును చీర కట్టుకోదా అని ప్రశ్నించారు. లోక్‌సభలో పదేళ్లనుంచి ఉన్న అవినాష్‌రెడ్డిని చిన్నాపిల్లాడని మాయ మాటలు చెప్పిన జగన్‌కి ఓటుతో సమాదానం చెప్పాలన్నారు. నేర చరిత్రలో నెంబర్ వన్, దోచుకోవడంలో దిట్టయిన జగన్ అడుగుజాడల్లో ఇక్కడ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు నడిచారని అన్నారు. పంచాయతీరాజ్ మంత్రి అయ్యుండి నువ్వేం అభివృద్ధి చేశావని బూడిని ప్రశ్నించారు. బినామీల పేర్లతో కాంట్రాక్టులు తీసుకొని నాసిరకం పనులు చేసి డబ్బు సంపాదించారన్నారు. అలాంటి వ్యక్తి ఉప ముఖ్యమంత్రి పదవిలో ఉండడమా అంటూ విమర్శించారు. ఆయన దోచుకున్నదంతా కక్కించి ప్రజలకు ఉపయోగపడే విధంగా చేస్తానని అన్నారు. రైతాంగం, ఉద్యోగులు, యువత ఎవరూ కూడా వైసీపీకి మద్దతు తెలపడం లేదని అన్నారు. యువతను కూడా మోసం చేశారని అన్నారు.

మాడుగుల, చోడవరంలను అభివృద్ధి చేస్తా ..

అనకాపల్లి పార్లమెంట్ అభివృద్ధిలో వెనుకబడి ఉందని సాక్షాత్తు పీఎం మోదీ తనను ఇక్కడకు పంపించారని సీఎం రమేశ్ అన్నారు. తనతోపాటు ఎమ్మెల్యే అభ్యర్థి బండారు సత్యన్నారాయణమూర్తిని భారీ మెజారిటీతో గెలిపించే బాధ్యత తీసుకోవాలని నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు హితవు పలికారు. తాను ఎంపీగా ఎన్నికైన వెంటనేత వెనుకబడిన మాడుగుల,చోడవరం నియోజకవర్గాలను అభివృద్ధి చేసి చూపిస్తామని అన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలో మాడుగుల నియోజకవర్గంలో ఇంజనీరింగ్ కళాశాలతో పాటు పరిశ్రమలు తీసుకు వచ్చే బాధ్యత తనదని సీఎం రమేష్ తెలిపారు. విద్యార్థులకు తొలిప్రాధాన్యత ఇస్తామని అన్నారు. రోడ్లతోపాటు, పరిశ్రమలు, ఆస్పత్రుల అభివృద్ధి, రైతులకు సాగునీటి ప్రాజెక్టుల పూర్తి చేసి చూపిస్తామని అన్నారు. అంతకు ముందు ఎమ్మెల్యే అభ్యర్థి బండారు సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ, గవిరెడ్డి రామానాయుడు ప్రసంగించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి వీవీజీ కుమార్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి రాయపురెడ్డి కృష్ణ, సంతోషి సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.



నాగాపురంలో పునాదులకే పరిమితమైన జగన్న కాలనీ ఇళ్లు



జగన్నకాలనీకి వెళ్లే రహదారిలో కల్వర్టు నిర్మించాల్సిన ప్రదేశం ఇదే

అక్కరకురాని జగనన్న ఇళ్ల స్థలాలు

- సీహెచ్. నాగాపురం, పాత కృష్ణాపురంల్లో లబ్ధిదారుల గగ్గోలు

కృష్ణాదేవిపేట, ఏప్రిల్ 27: మండలంలోని సీహెచ్. నాగాపురం, పాతకృష్ణాదేవిపేట పంచాయతీలకు కేటాయించిన జగనన్న ఇళ్ల స్థలాలు అస్తవ్యస్తంగా ఉండడంతో లబ్ధిదారులు గగ్గోలుపెడుతున్నారు. ఈ రెండు పంచాయతీల్లో 173 మంది ఇళ్ల లబ్ధిదారులను గుర్తించి రెండేళ్లక్రితం సీహెచ్‌నాగాపురంలో జగనన్న ఇళ్లస్థలాలను ప్రభుత్వం మంజూరు చేసింది. అయితే ఈస్థలాలు అనువుగా లేవు. దీంతో చేసేది లేక 173మంది లబ్ధిదారుల్లో సుమారు 10 మంది మాత్రమే పునాదులు తీశారు. అవి ప్రస్తుతం నిరుపయోగంగా వదిలేశారు. దీనికితోడు ఈస్థలాలకు ఆనుకుని శ్మశానం, మరోవైపు సాగునీటిచెరువు ఉంది. సీహెచ్‌సీ నాగాపురం గ్రామంలో 75మంది లబ్ధిదారులకు, పల్లావూరు 25 మందికి, కుమారుపురం 11మందికి , పాతకృష్ణాదేవిపేటలో 62మందికి ఈ లబ్ధిదారులకు ఈస్థలాల్లోనే పట్టాలు మంజూరు చేశారు. ఈ లే అవుట్‌లో రూ.20 లక్షలకుపైగా వెచ్చించి విద్యుత్‌శాఖాధికారులు విద్యుత్ స్తంభాలు వేశారు. అయినా, స్థలాలు నివాసాలకు అనువుగా లేక చాలా మంది పట్టాలకే పరిమితమైయ్యారు. వర్షాకాలంలో జగనన్న ఇళ్లస్థలాలకు వద్దకు వెళ్లేందుకు సరైన రహదారిలేక చెరువు కాలువ ఉంది. దీనికి ప్రభుత్వం భారీ కల్వర్టు నిర్మించాల్సి ఉంది. గతంలో పక్కనున్న చెరువులు నిండితే పంటపొలాలు నీటి మునిగిన దాఖాలాలు ఎన్నో ఉన్నాయి. ఇటువంటిచోట సుమారు మూడెకరాల ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో జగనన్న ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు లబ్ధిదారులు వెనుకంచేస్తున్నారు. స్థలాలను అనువుగా మార్చి ఇవ్వాలని ప్రభుత్వాన్ని లబ్ధిదారులు కోరుతున్నారు.



నిరుపయోగంగా ఉన్న విద్యుత్ స్తంభాలు

మాడుగుల నియోజకవర్గం

పూరిల్లు దగ్ధం



మంటలు అదుపుచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

మాడుగుల, ఏప్రిల్ 27 : స్థానిక నూకాలమ్మ కాలనీలో శనివారం ఓ పూరిల్లు దగ్ధమైంది. ఉదయం పదకొండు గంటల సమయంలో వంట మాధవి ఇంటికి నిప్పంటుకుని మంటలు చెలరేగాయి. దీంతో స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది వెంటనే వచ్చి మంటలను ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. అప్పటికే ఇంట్లో ఉన్న సామగ్రి, సర్టిఫికెట్స్, నగదు కాలి బూడిదయింది. ఈ ప్రమాదంలో రూ.1.9 లక్షలు నష్టం వాటిల్లినట్టు బాధితురాలు తెలిపినట్టు అగ్నిమాపక అధికారి వీ రాజేశ్వర్రావు తెలిపారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ప్రమాదం జరిగినట్టు చెప్పారు. మంటల అదుపు చేయడంలో ఎల్‌ఎఫ్ బోగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు. బాధితురాలు మాధవి కుటుంబానికి మాడుగుల పట్టణ జనసేన నాయకులు రూ.6 వేలు, మాజీ ఎంపీపీ వేమవరపు రామధర్మజ రూ.10 వేలు సాయంగా అందించారు.

'సీఎం రమేష్‌ను గెలిపించండి'



చోడవరంలో ప్రచారం చేస్తున్న సీఎం రమేశ్ సోదరీమణులు

చోడవరం, ఏప్రిల్ 27: అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థిగా సీఎం రమేష్‌కు అవకాశం ఇస్తే అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తారని సీఎం రమేష్ సోదరీమణులు విజయలక్ష్మి, జ్యోతి, తేజ ఓటర్లకు హామీ ఇచ్చారు. శనివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం సాయంత్రం పట్టణంలోని వెంకయ్యగారిపేట, అన్నవరం గ్రామా ల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి అభ్యర్థి సీఎం రమేష్‌తోపాటు, టీడీపీ, జనసేన అభ్యర్థులను గెలిపిస్తే చోడవరం ప్రాంతం అభివృద్ధిపథంలో పయనించడానికి అవకాశం ఉంటుందన్నారు. వైసీపీకి ఓటేస్తే ప్రజలను ముంచేస్తారన్నారు. అభివృద్ధి చేసే నాయకులను ఓటర్లు ఆదరించాలని కోరారు. కమలం గుర్తుపై ఓటేసి సీ ఎం రమేష్‌ను గెలిపించాలని కోరారు. ఈ ఎన్నికల ప్రచారంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు గూనూరు మూలినాయుడు, నాగరాజు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నాగుపాము హతం

దేవరాపల్లి, ఏప్రిల్ 27: మండలంలోని బి.కింతాడ శివారు కొత్తూరులో నాగుపాము హడలెత్తించింది. పంట కాలువను ఆనుకొని ఉన్న పొలంలో శనివారం ఉదయం గ్రామానికి చెందిన పెంటకోట చిన్నోడు, అన్నంరాము తుప్పలను తొలగిస్తుండగా బుసలు కొడుతూ వారిపైకి వచ్చింది. వెంటనే సమీపంలో ఉన్న రైతులకు సమాచారం ఇవ్వడం తో వారు దానిని హతమర్చారు.



హతమైన నాగుపాము